గురువారం
29-12-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 187
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

సీపీసీ 20వ జాతీయ మహాసభ నిర్ణయాల అమలే మన లక్ష్యం

కొత్తశకంలో చైనా సామ్యవాదం అమలే లక్ష్యమని, అలసత్వానికి, అధికారాల దుర్వినియోగానికి తావు ఉండకూడదని, ఐక్యమత్యమే మన బలం అని సీపీసీ పొలిట్‌బ్యూరో సభ్యులకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ స్పష్టంచేశారు.

2లో

చంద్రబాబు సభలో అపశ్రుతి

9 మంది దుర్మరణం

మరో నలుగురి పరిస్థితి విషమం

- ఇద్దరు మహిళల మృత్యువాత
- భారీగా హాజరైన కార్యకర్తలు, ప్రజలు
- సభ వద్ద తొక్కిసలాట
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం
- రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పాల్గొన్న నెల్లూరు జిల్లా కందుకూరు సభలో అపశ్రుతి చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో 9 మంది దుర్మరణం చెందగా కొంతమంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. మృతుల్లో ఇద్దరు మహిళలు ఉన్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. మృతులను దేవినేని రవీంద్ర (ఆత్మకూరు), కలవకురి యానాది (కొండముడుసుపాలెం), యటగిరి విజయ (ఉలవపాడు), కకుమాను రాజా (కందుకూరు), మరలపాటి చినకొండయ్య (గుళ్లపాలెం), పురుషోత్తం (కందుకూరు), మధుబాబుగా గుర్తించారు. కార్యకర్తలు భారీగా తరలి రావడంతో తోపులాట జరిగి కొందరు కార్యకర్తలు డ్రైనేజీలో పడిపోయారు. అప్రమత్తమైన టీడీపీ నేతలు గాయపడిన కార్యకర్తలను వెంటనే ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ 8మంది మృతి చెందారు. వెంటనే చంద్రబాబు తన ప్రసంగం ఆపేసి.. ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. ఆసుపత్రిలో దృశ్యాలు చూసి చంద్రబాబు తల్లడిల్లిపోయారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ కందుకూరులో ఇలాంటి దుర్ఘటన జరగడం తన మనసు కలచివేసిందన్నారు. అమాయకులు చనిపోవడం బాధ కలిగిస్తోందన్నారు. మృతుల కుటుంబాలకు పార్టీ తరపున రూ.10లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు ప్రకటించారు. బహిరంగ సభను సంతాప సభగా ప్రకటించిన చంద్రబాబు... బాధిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. బాధితుల పిల్లలను ఎన్టీఆర్ ట్రస్ట్ విద్యాసంస్థల్లో చదివిస్తామన్నారు. సభకు హాజరైన వారు జాగ్రత్తగా ఇంటికి వెళ్లాలన్నారు. చనిపోయిన వారి కోసం సభ వద్ద మౌనం పాటించారు. ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా నెల్లూరు జిల్లా కందుకూరులో చంద్రబాబు పర్యటించారు. ఇటీవల చంద్రబాబు నిర్వహిస్తున్న కార్యక్రమాలకు అనూహ్య స్పందన వస్తోంది. ఈ క్రమంలో బుధవారం నాడు కందుకూరులో నిర్వహించిన సభకు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ క్రమంలో పార్టీ కార్యకర్తల మధ్య

- మిగతా 2 లో

మోదీజీ... మీరే దిక్కు

- 8 ఏళ్లుగా అపరిష్కృతంగా విభజనాంశాలు
- రెండు రాష్ట్రాల మధ్య సమస్యలూ పెండింగే
- ప్రత్యేక హోదాపై సానుకూలంగా స్పందించండి
- విభజనతో నష్టపోయిన ఏపీకి అత్యవసరం
- ప్రధానితో సీఎం జగన్ సుదీర్ఘ భేటీ
- పాత అంశాలే మళ్లీ ప్రస్తావన
- ఊసేలేని విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాష్ట్ర విభజన జరిగి 8 ఏళ్ల గడిచినప్పటికీ విభజన చట్టంలో పేర్కొన్న అంశాల్లో చాలావరకు ఇప్పటికీ నెరవేర్చలేదని, రెండు రాష్ట్రాల మధ్య కూడా ఇంకా చాలా అంశాలు అపరిష్కృతంగానే ఉన్నాయని, మీరు జోక్యం చేసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీకి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రెండు రోజుల దిల్లీ పర్యటనలో భాగంగా మంగళవారం రాత్రికే హస్తిన చేరుకున్న సీఎం

- మిగతా 2 లో

ఉమ్మడి శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టులపై తెలంగాణా ఏకపక్ష వైఖరి

2లో

మోదీ విధానాలతో పేదరికం పైపైకి...

- రాయితీ ధరలకు రేషన్ కట్
- 64 శాతం మార్కెట్ ధరకే నిత్యావసరాలు
- ఆహార సబ్సిడీల్లో కోత
- ప్రజలకు తప్పని అదనపు భారం

న్యూదిల్లీ: భారతదేశ జనాభాలో 90శాతం పేదలు ఉన్నట్లు అంతర్జాతీయ ప్రమాణాలు చెబుతున్నాయి. ప్రపంచ బ్యాంకు దారిద్ర్య రేఖను రోజుకు 1.9 డాలర్ల నుంచి 2.15 డాలర్లకు పెంచింది. అంటే రూ.143 నుంచి రూ.176కి పెరిగింది. అంటే నెలసరి వ్యయం ఒక్కొక్కరికి రూ.2,650 వరకు ఉండవచ్చు. కుటుంబంలో ఐదుగురు ఉంటే రూ.13,250 ఖర్చు అవుతుంది. మొత్తం 81 కోట్ల మంది పేదలకు ఉచితంగా ఆహార ధాన్యాలు అందజేస్తున్నట్లు కేంద్రప్రభుత్వం గొప్పలు పోతోందిగానీ... దీనివల్ల పేదల

- మిగతా 2 లో

జగనన్న ఇళ్లు, టిడ్కో ఇళ్ల లబ్ధిదారులతో

ఫిబ్రవరి 22న రాష్ట్ర సదస్సు

- విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం జనవరి 23-25 తేదీల్లో దీక్షలు
- సీపీఐ రాష్ట్ర విస్తృత కార్యవర్గ సమావేశం నిర్ణయం
- ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణకు సంఘటిత పోరు
- రామకృష్ణ వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జగనన్న ఇళ్ల నిర్మాణానికి ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున ఇవ్వాలని, టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు స్వాధీనపరచాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 22వ తేదీన విజయవాడలో రాష్ట్ర సదస్సు నిర్వహించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)-ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విస్తృత కార్యవర్గ సమావేశం నిర్ణయించినట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ వెల్లడించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం జనవరి 23 నుంచి 25 వరకు రాష్ట్ర వ్యాప్తంగా దీక్షలు నిర్వహించాలని, కాలరాయబడుతున్న ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ కోసం సంఘటిత పోరుకు నడుంకట్టాలని సీపీఐ నిర్ణయించినట్లు రామకృష్ణ తెలిపారు. సీపీఐ-ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గ విస్తృత సమావేశం బుధవారం విజయవాడ దాసరి నాగభూషణరావు భవన్‌లో కామ్రేడ్ ఎం.ఎల్.నారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ అజీజ్ పాషా పాల్గొని జాతీయ రాజకీయ పరిణామాలపై వివరించారు. నరేంద్ర మోదీ పాలనలో మైనార్టీలు, దళితులు, గిరిజనులు అభద్రతాభావంతో జీవిస్తున్నారన్నారన్నారు. మతోన్మాద, కార్పొరేట్ అనుకూల వైఖరి అవలంభిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా కమ్యూనిస్టులు పని చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ తాము అధికారంలోకొస్తే పేదలందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించి, ఉచితంగా ఇళ్లు నిర్మించి ఇస్తామని గత ఎన్నికల సందర్భంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మూడేళ్లు గడచినా నెరవేర్చలేదన్నారు. సెంటు స్థలం మాత్రమే కేటాయించి, పైగా ఇళ్లను లబ్ధిదారులే నిర్మించుకోవాలని ఒక్కో ఇంటి నిర్మాణానికి కేవలం రూ.1.80 లక్షలు మాత్రమే ఇస్తామని చెబుతున్నారన్నారు. ఒక ఇంటి నిర్మాణానికి ఎంత ఖర్చవుతుందో ముఖ్యమంత్రికి, ఆయన సలహాదారులకు తెలియదా? అని ప్రశ్నించారు. జగనన్న ఇళ్ల నిర్మాణానికి ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సీఎం జగన్ అధికారం చేపట్టిన నాటి నుంచి కేవలం అప్పులు చేయడంపై పెట్టిన దృష్టి, రాష్ట్ర అభివృద్ధిపై పెట్టలేదన్నారు. ఆఖరుకు ఉద్యోగుల నెల జీతాల చెల్లించేందుకు కూడా అప్పులు వెతుక్కునే దుస్థితి దాపురించిందని తెలిపారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని, అధికార వైసీపీ దాడులు,

- మిగతా 2 లో

ఇదీ లోకం!

నాకు తెలవక అడుగుతున్నాను, ఇప్పుడున్న పరిస్థితులలో తిట్టాల్సివస్తే ఎవరిని తిట్టాలి సార్!

ఏం చేశామని ఓట్లు అడుగుతాం

సొంత ప్రభుత్వంపై ఎమ్మెల్యే ఆనం అసహనం

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: రాష్ట్ర ప్రభుత్వంపై వైసీపీ ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. నెల్లూరు జిల్లా రాపూరులో నూతనంగా నియమించిన సచివాలయ వైసీపీ కన్వీనర్లు, వలంటీర్లతో బుధవారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో రామనారాయణరెడ్డి ప్రసంగించారు. 'రోడ్ల గుంతలు పూడ్చలేకపోతున్నాం.. తాగడానికి నీళ్లు లేవు. నాలుగేళ్లలో ఏం పని చేశామని ప్రజలను ఓట్లు అడుగుతాం. ప్రాజెక్టులు కట్టామా? పనులు మొదలుపెట్టామా? పింఛన్లు ఇస్తే ఓట్లు వేస్తారా? అలా అయితే గత ప్రభుత్వమూ ఇచ్చింది. ఇల్లు కడతామని లేఅవుట్ వేసినా ఇప్పటికీ కట్టలేదు' అని రాష్ట్ర ప్రభుత్వం తీరుపై ఆనం విరుచుకుపడ్డారు. 'ఎస్ఎస్ కెనాల్ కడతామని ఎన్నికల వేళ హామీ ఇచ్చాం. మూడున్నరేళ్లయినా కనీసం కెనాల్ గురించి పట్టించుకోలేదు. దీని

- మిగతా 2 లో

శ్రామికులపై భారం సంస్కరణా?

- జాతీయ పెన్షన్ పథకంపై సన్యాల్ ప్రకటన సిగ్గుచేటు
- కార్పొరేట్ల పన్ను తగ్గించడం... చట్టాలు నిర్వీర్యం చేయడమే
- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్

8లో

యూపీలో ఓబీసీ కోటా రగడ

8లో

ఐఎంఏకు అవార్డుల పంట

రాష్ట్ర శాఖను వరించిన 11 జాతీయ పురస్కారాలు

భారతీయ వైద్య సంఘం (ఐఎంఏ) ఆంధ్రప్రదేశ్ శాఖకు అవార్డుల పంట పండింది. ప్రజారోగ్య పరిరక్షణ, వైద్యుల సంఘానికి అందించిన సేవలకుగాను 11 జాతీయ పురస్కారాలు వరించాయి.

2లో

గ్రీస్ కమ్యూనిస్టు విప్లవయోధుడు

లాజరస్ కిరిట్సిస్ కన్నుమూత

ఏథెన్స్: గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) సీనియర్ నాయకుడు గెరిల్లాయోధుడు లాజరస్ కిరిట్సిస్ (102) ఏథెన్స్‌లో మృతి చెందారు. లాజరస్ మృతివార్తను కేకేఈ కేంద్ర కమిటీ ధ్రువీకరించింది. ఆయన మృతికి సంతాపాన్ని ప్రకటించింది. ఘన నివాళులర్పించింది. లాజరస్‌ను తిరుగులేని కమ్యూనిస్టు విప్లవయోధునిగా శ్లాఘించింది. ప్రజల హక్కులు, కార్మికుల కోసం అనేక ఉద్యమాలను ముందుండి నడిపించారని, మనిషిని మనిషి దోచుకునే పద్ధతి నిరోధానికి సైద్ధాంతిక పోరాటమే చేశారని గుర్తుచేసింది. సోషలిజం-కమ్యూనిజం కోసం ఎనలేని కృషిచేశారని పేర్కొంది. లాజరస్ 1920లో లొయన్నినాలోని చిరుగ్రామమైన హరాఫ్గీలో జన్మించారు. ఏథెన్స్ యూనివర్సిటీ లా స్కూల్‌లో చేరారు. అయితే రెండవ ప్రపంచ యుద్ధం మొదలు కావడంతో ఆయన విద్యాభ్యాసం మధ్యలోనే ఆగిపోయింది. నేషనల్ లిబరేషన్ మూవ్‌మెంట్ అనుబంధ గ్రీక్ పీపుల్స్ లిబరేషన్ ఆర్మీలోని ఈఏఎం- ఈఎల్ఏఎస్ ర్యాంకుల్లో పనిచేశారు. 1996లో అరెస్టుకు గురై రాజకీయ ఖైదీగా మక్రోనిసోస్ ద్వీపకల్పానికి పంపబడ్డారు. 40ఏళ్లకుపైగా అజ్ఞాతవాసంలో గడిపారు. 1948 మార్చి1న నేషనల్ ఆర్మీ 350 మందిని ఊచకోత కోయగా అందుకు ప్రత్యక్ష సాక్షుల్లో లాజరస్ ఒకరిగా ఉన్నారు. కేకేఈ అండర్‌గ్రౌండ్ నట్వర్క్‌లో చేరాక ఏథెన్స్‌కు తిరిగొచ్చారు. స్థానికంగానే కాకుండా జాతీయ రాజకీయాల్లోనూ రాణించారు. ఐక్య ప్రజాస్వామ్య వామపక్షంలో కీలక పదవులు చేపట్టారు. 1967లో మిలిటరీ జుంటా వల్ల ఆయనకు ఆరేళ్ల కారాగార శిక్షపడింది. 1974లో నియంత పాలన అంతమైంది. ఆ తర్వాత లాజరస్ తిరిగి రాజకీయాలు చేశారు. సామాజిక ఉద్యమాలకు నేతృత్వం వహించారు. కేకేఈ నేతగా పార్లమెంటులో, జాగ్రోఫా మున్సిపాలిటీలో కీలకంగా ఉన్నారు. నేషనల్ యూనియన్ ఆఫ్ మెక్రోనిసోస్ కన్విన్డ్ కాంబాటంట్స్ (పీఈకేఏఎం) స్థాపనలో ప్రధానపాత్ర పోషించారు. 2020 సెప్టెంబరులో మాక్రోనిసోస్‌లో కేకేఈ నిర్వహించిన భావోద్వేక కార్యక్రమంలో పాల్గొని అమర కామ్రేడ్‌లకు పుష్పాంజలి ఘటించారు. వారి జ్ఞాపకాలను స్మరించుకున్నారు. అప్పుడు ఆయనకు వందేళ్లు. కాగా లాజరస్ మృతి పార్టీకి తీరని లోటని, ఆయన చిరస్మరణీయులని కేకేఈ పేర్కొంది.

ఐఎంఏకు అవార్డుల పంట

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: భారతీయ వైద్య సంఘం (ఐఎంఏ) ఆంధ్రప్రదేశ్ శాఖకు అవార్డుల పంట పండింది. ప్రజారోగ్య పరిరక్షణ, వైద్యుల సంఘానికి అందించిన సేవలకుగాను 11 జాతీయ పురస్కారాలు వరించాయి. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సి.శ్రీనివాసరాజు(ఏలూరు)కు, డాక్టర్ ఏకేఎస్ సిన్హాతో పాటు వైద్య విద్యా విభాగం కార్యక్రమాలలో కీలకపాత్ర పోషించినందుకు డాక్టర్ డి.శ్రీహరిరావు(తిరుపతి)కు, సీపీఆర్- ప్రథమ చికిత్సలో దేశవ్యాప్తంగా శాస్త్రీయ అవగాహన కార్యక్రమాలు నిర్వహించినందుకు డాక్టర్ ఎస్సీ చక్రరావు(కాకినాడ), డాక్టర్ ఏకేఎస్ఎస్‌లకు ఈ అవార్డులు లభించాయి. ఐఎంఏ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శిగా కోవిడ్ సమయంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, వైద్యులకు, వైద్యసంఘానికి అందించిన సేవలకు ఉత్తమ రాష్ట్ర కార్యదర్శి అవార్డుని డాక్టర్ గార్లపాటి నందకిషోర్(గుంటూరు), డాక్టర్ ఎం.సుభాశ్ చంద్రబోస్ (విజయవాడ), కార్డియాలస్ట్‌గా ఉత్తమ సేవలు అందించడమే కాకుండా కార్డియాలజీ రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించిన రమేశ్ హాస్పిటల్స్ కార్డియాలజీ విభాగం అధిపతి డాక్టర్ పీఎన్ఎస్ హరిత(గుంటూరు)కు, గుంటూరు శాఖ కార్యదర్శిగా అందించిన సేవలకు, సేవల డైరెక్టరీని ప్రచురించినందుకు డాక్టర్ టి.సేవకుమార్ (గుంటూరు)కు, అనంతపురం శాఖాధ్యక్షుడిగా ఉత్తమ సేవలు అందించిన డాక్టర్ జి.హేమలతకు, డాక్టర్ రాయపు రమేశ్‌తిరుపతి), డాక్టర్ రోహిణి (గూడూరు), డాక్టర్ పి.అనిల్ కుమార్(నంద్యాల)కు అవార్డులు లభించాయి. ఈనెల 26-28 తేదీలలో ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్‌లో జరిగిన ఐఎంఏ జాతీయ సదస్సులో జాతీయ అధ్యక్షులు డాక్టర్ సహజా నంద ప్రసాద్‌సింగ్ ఈ అవార్డులు ప్రదానం చేశారు.

ఫిబ్రవరి 22న రాష్ట్ర సదస్సు

(మొదటిపేజీ తరువాయి)

ఆగడాలు, బెదిరింపులు రోజురోజుకూ పెచ్చరిల్లిపోతున్నాయని, వాటిని అరికట్టాల్సిన పోలీసు యంత్రాంగం చేష్టలుడిగి చూస్తోందని విమర్శించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కమ్యూనిస్టులు కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. సభ్యుల చర్చల అనంతరం సమావేశం వివిధ నిర్ణయాలు చేసింది. జగనన్న ఇళ్లకు రూ.5 లక్షలు ఇవ్వాలని, టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు స్వాధీనపరచాలనే డిమాండ్‌తో 2023 జనవరి 17 నుంచి 30వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాలలో జగనన్న ఇళ్ల లబ్ధిదారులను కలిసి అర్జీలపై సంతకాలు సేకరించాలని నిర్ణయించింది. ఫిబ్రవరి 6న జిల్లా కేంద్రాల్లో లబ్ధిదారులతో సదస్సులు నిర్వహించి, కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేయాలని, ఫిబ్రవరి 22న జగనన్న ఇళ్లు, టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల 'రాష్ట్ర సదస్సు' విజయవాడలో ఏర్పాటు చేయాలని చర్చించింది.

రైతాంగ సమస్యలపై రైతు సంఘాల ఐక్యవేదిక చేపట్టిన సమైక్య ఉద్యమంలో భాగస్వాములవ్వాలని, ఏపీకి ప్రత్యేక హోదా, విభజన చట్ట హామీల అమలు సాధన కోసం విద్యార్థి, యువజన సంఘాల అధ్వర్యంలో 2023 జనవరి 20 నుంచి ఫిబ్రవరి 4 వరకు జరిగే బస్సు యాత్ర జయప్రదానికి తోడ్పడాలని తెలిపింది. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం జనవరి 23, 24 తేదీలలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రెవెన్యూ డివిజన్లలో, 25న కలెక్టరేట్‌ల వద్ద దీక్షలు చేపట్టాలని, జనవరి 27న విశాఖలో జరిగే కార్మికుల పోరాటానికి సంఘీభావం తెలపాలని నిర్ణయించింది. ఫిబ్రవరి 8 నుంచి 14 వరకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న నీటి పారుదల ప్రాజెక్టులను రాష్ట్ర పార్టీ ప్రతినిధి బృందం సందర్శించాలని, రాష్ట్రంలో కుదేలయిన భవన నిర్మాణ రంగాన్ని కాపాడుకునేందుకు ఉద్యమానికి సిద్ధం కావాలని సమావేశం నిర్ణయించింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని గిరిజన ప్రాంతమైన పాడేరు హాస్టళ్లలో నెలరోజుల వ్యవధిలోనే ఏడుగురు విద్యార్థులు అనారోగ్యానికి గురై మరణించడంపై సమావేశం చర్చించింది, గిరిజన ప్రాంతాల్లో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, తగిన వైద్య సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే హెల్త్ అసిస్టెంట్లను, ఏఎన్ఎంలను నియమించాలని డిమాండ్ చేస్తూ సమావేశం ఏకగ్రీవ తీర్మానం చేసింది. ఈ సమావేశంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు రావుల వెంకయ్య, అక్కినేని వనజ, రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

ఏం చేశామని ఓట్లు అడుగుతాం

(మొదటిపేజీ తరువాయి)

గురించి సీఎం జగన్‌కు ఎన్నోసార్లు చెప్పాం. ఇదే విషయాన్ని అసెంబ్లీలోనూ ప్రస్తావించాం. చీఫ్ ఇంజినీర్ల భేటీలోనూ కోరాం. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉంది. కళ్ల ముందు నీళ్లున్నాయని సంతోషపడటమే తప్ప, వాటిని తాగలేని పరిస్థితి. ఇక్కడి నీళ్లు తాగ గలమనే విశ్వాసం ప్రజలకు లేదు. కండలేరు దగ్గరే ఉన్నా రాపూరులో ఒక్క చెరువులో నీళ్లు నింపలేకపోయాం. కండలేరు అభివృద్ధి విషయంలో వైఎస్ఆర్ కలను నెరవేర్చలేకపోయాం. ఆయన కల నెరవేర్చలేని దౌర్భాగ్య స్థితిలో మనం ఉన్నాం. ప్రజలు నన్ను కూడా నమ్మే పరిస్థితి లేదు. అపనమ్మక వ్యవస్థలో పనిచేస్తున్నాం. గ్రామాల్లో ప్రజలకు బిందెడు నీళ్లు ఇవ్వలేకపోతున్నాం' అని ఆనం మండిపడ్డారు. సమావేశంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నెల్లూరు రవీంద్రారెడ్డి, వైసీపీ జిల్లా నాయకులు పాపకన్ను దయాకర్‌రెడ్డి, చెన్ను భాస్కర్‌రెడ్డి, మండల నాయకులు శశిధర్‌రెడ్డి, నల్లవడ్ల వెంకట రమణారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీసీ 20వ జాతీయ మహాసభ నిర్ణయాల

అమలే మన లక్ష్యం

- కొత్తశకంలో చైనా సామ్యవాదం విజన్‌తో ముందుకు
- అలసత్వం-అధికారాల దుర్వినియోగానికి తావులేదు
- పొలిటికల్ బ్యూరో సమావేశంలో జిన్‌పింగ్

బీజింగ్: కొత్తశకంలో చైనా సామ్యవాదం అమలే లక్ష్యమని, అలసత్వానికి, అధికారాల దుర్వినియోగానికి తావు ఉండకూడదని, ఐక్యమత్యమే మన బలం అని సీపీసీ పొలిట్‌బ్యూరో సభ్యులకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ స్పష్టంచేశారు. సీపీసీ 20వ మహాసభల్లో జరిగిన ప్రధాన నిర్ణయాలు, ప్రణాళికలు అమలు చేయాలని సోమ, మంగళవారాల్లో జరిగిన చైనా కమ్యూనిస్టు పార్టీ (సీపీసీ) పొలిటికల్ బ్యూరో సమావేశం తీర్మానించింది. ఈ దిశగా ఐక్యంగా ముందుకెళ్లాలని నొక్కిచెప్పింది. కొత్త శకం కోసం చైనా లక్షణాలతో సామ్యవాదం దిశగా జిన్‌పింగ్ చేసిన ఆలోచనల అమలే లక్ష్యంగా ముందుకు సాగాలని సమావేశం నిర్ణయించింది. దేశంతో పాటు పార్టీ చరిత్రలోనే 2022 కీలక వత్సరమని పేర్కొంది. సమావేశంలో సీపీసీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి జిన్‌పింగ్ కీలకోపన్యాసం చేశారు. ఆత్మవిమర్శ చేసుకోవడం ముఖ్యమని సభ్యులకు సూచించారు. రాజకీయ సమగ్రత బలోపేతం, పటిష్ఠ న్యాయకత్వం, పార్టీ కీలక నేతల మధ్య సమన్వయం, విశ్వాసం ముఖ్యమని నొక్కిచెప్పారు. ఐక్యంగా ప్రగతిపథంలో పయనించడం, కేంద్రీకృత-ఐక్య నాయకత్వం కోసం కసరత్తు వంటి అంశాలపై ముఖ్యంగా 20వ సీపీసీ మహాసభల్లో తీసుకున్న ప్రధాన నిర్ణయాలను కచ్చితంగా అమలు చేసేందుకు కార్యాచరణ దిశగా ఈ సమావేశం జరిగింది. 2022 అంతర్జాతీయ పరిణామాలు, ఆర్థిక, సామాజిక సుస్థిరత వంటి అంశాలను చర్చించింది. చైనా ఆహారధాన్యాల దిగుమతి వరుసగా ఎనిమిదో సంవత్సరంలో 650 మిలియన్ మెట్రిక్ టన్నులకుపైగా నమోదైంది. ఇందుకు చైనా కమ్యూనిస్టు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, ఆహార భద్రత, ఇంధన భద్రత, ప్రజల బాగు దృష్ట్యా తీసుకున్న చర్యలే కారణమని సమావేశం పేర్కొంది. బీజింగ్ వింటర్ ఒలింపిక్స్, పరాలింపిక్స్ విజయవంతంగా నిర్వహించామని తెలిపింది. పార్టీ కేంద్ర కమిటీలో కీలక పదవిలో ఉండి జిన్‌పింగ్ తీసుకున్న నిర్ణయాలు నిర్ణయాత్మక ప్రాధాన్యతను సంతరించుకున్నట్లు పొలిటకల్ బ్యూరో సభ్యులంతా ఏకగ్రీవంగా పేర్కొన్నారు. జిన్‌పింగ్ మాట్లాడుతూ, మహాసభ సూచించినవన్నీ అమలయ్యేలా అన్ని స్థాయిల్లో అధికారులు చర్యలు తీసుకోవాలని, తమ బాధ్యతలను కచ్చితంగా నిర్వర్తించాలని జిన్‌పింగ్ సూచించారు. పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. ఆత్మవిమర్శ చేసుకుంటూ మార్పులు తెచ్చుకోవాలని సూచించారు. రాజకీయ అవగాహన పెంచుకుంటూ వ్యవస్థలను బలోపేతం చేసేలా పొలిట్ బ్యూరో సభ్యుల మార్గదర్శకత్వం ఉండాలన్నారు. దేశ ప్రయోజనాలతో పాటు పార్టీ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని పనిచేయాలని కోరారు. స్వీయ-కేంద్రీకృత ప్రవర్తన, వికేంద్రీకరణ, నిబంధనలను నిరక్ష్యం చేయడం వంటివి జరగకుండా చూడాలని జిన్‌పింగ్ ఆదేశించారు. పార్టీ ఎనిమిది అంశాల నిర్ణయాన్ని అమలు చేసేందుకు కట్టుబడాలని పొలిట్ బ్యూరోకు స్పష్టంచేశారు. ప్రవర్తనా నియమావళికి కట్టుబడి అందరికీ ఆదర్శంగా నిలవాలని సూచించారు. తమ అధికారాలను ఎవరూ దుర్వినియోగించుకోకుండా సొంత కుటుంబాలు, బంధుమిత్రులతో పాటు చుట్టూ ఉండే వ్యక్తులతో పొలిట్ బ్యూరో సభ్యులంతా కఠినంగా ఉండాలని, అలసత్వానికి తావు లేదని జిన్‌పింగ్ ఆదేశాలిచ్చారు.

ఉమ్మడి శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టులపై

తెలంగాణ ఏకపక్ష వైఖరి

- కేఆర్ఎంబీ నిబంధనలు ఉల్లంఘిస్తోంది
- దీంతో కృష్ణాజలాల్లో వాటా కోల్పోతున్నాం
- అందువల్ల సీమ లిప్టు ఏపీకి అనివార్యం
- తక్షణమే అనుమతిలివ్వండి
- కేంద్ర మంత్రి భూపేంద్రయాదవ్‌కు సీఎం జగన్ వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : కృష్ణానదిపై ఉన్న ఉమ్మడి జలాశయాలైన శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులలో తెలంగాణ ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తోందని, కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు ఆపరేషనల్ ప్రోటోకాల్స్‌ను, ఒప్పందాలను, ఆదేశాలను సైతం ఉల్లంఘిస్తోందని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి బుధవారం కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌ను కలిసి వివరించారు. దీనివల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా నదిపై తనకున్న వాటా హక్కులను కోల్పోవల్సి వస్తోందని తెలిపారు. ఈ నష్టాన్ని కొంత భర్తీ చేసుకునేందుకు తాము ప్రారంభించిన రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంకు సంబంధించి పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కోరారు. ఈ లిప్టు కరవుతో అల్లాడే రాయలసీమ ప్రాంతానికి తాగు, సాగునీరు అందించడానికి ఎంత అవసరమో వివరించారు. శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టుల్లో తెలంగాణా రాష్ట్రం వర్షాకాల సీజన్ ప్రారంభమైన జూన్ 1వ తేదీ నుంచే విద్యుత్ ఉత్పత్తి కోసం నీటిని వినియోగించడం ప్రారంభిస్తుంది. శ్రీశైలం జలాశయంలో కనీస నీటి స్థాయి 834 అడుగులు కంటే తక్కువగా ఉన్నప్పటికీ... తెలంగాణా ప్రభుత్వం కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) ముందు కనీసం ఎలాంటి ప్రతిపాదన కూడా లేకుండానే ఏకపక్షంగా విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించి నాగార్జున సాగర్ నుంచి కృష్ణా డెల్టాకు అవసరం లేనప్పటికీ నీటి విడుదల చేస్తుంది. విద్యుత్ ఉత్పత్తి కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రతి ఏటా 796 అడుగుల వరకు నీటిని దిగువకు విడుదల చేయడం వల్ల... శ్రీశైలం రిజర్వాయరులో కనీస నీటి మట్టం నిర్వహణకు సహకరించడం లేదు. దీనివల్ల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులు పడుతోంది. శ్రీశైలంలో జలాశయంలో నీటిమట్టం 881 అడుగులకు చేరుకుంటే తప్ప... పోతిరెడ్డిపాడు నుంచి పూర్తిస్థాయిలో నీటి విడుదల సాధ్యంకాదు. దీనివల్ల కరవు పీడిత రాయలసీమ సాగు, తాగునీటి అవసరాలతో పాటు శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు, చెన్నై మహానగరానికి తాగు నీరు అందించలేకపోతున్నాం. మరోపక్క తెలంగాణ ప్రభుత్వం అనధికారకంగా, ఎటువంటి పర్యావరణ అనుమతులు లేకుండానే పాలుమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం (3టీఎంసీలు), దిండి పథకాలను 800 అడుగుల వద్ద నిర్మిస్తుందని సీఎం వివరించారు. ఈ విషయాలన్నీ గతంలోనే కేంద్రం దృష్టికి తీసుకొచ్చామని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం (ఆర్ఎల్ఎస్)ను అమలు చేయడం మినహా ఏపీకి మరో ప్రత్యామ్నాయం లేదని, దీనిద్వారా రోజుకు 3 టీఎంసీల నీటిని టీజీపీ, ఎస్ఆర్‌బీసీ, జీఎన్ఎస్ఎస్‌లకు సరఫరా చేయగలుగుతామని తెలిపారు. వీలైనంత త్వరలో సీమ లిప్టుకు పర్యావరణ అనుమతులు వచ్చేలా చూడాలని సీఎం విజ్ఞప్తి చేశారు. అలాగే రామాయపట్నం, మచిలీపట్నం, భావనపాడులో మూడు గ్రీన్ ఫీల్డ్ పోర్టులను అభివృద్ధి చేస్తున్నామని, ఎర్రవరం, కురికుట్టి, సోమశిల, అవుకు వంటి చోట్ల పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులు, లోయర్ సీలేరు హైడ్రో పవర్ ప్రాజెక్టు (230 మెగావాట్లు), అప్పర్ సీలేరు పంప్డ్ స్టోరేజీ పవర్ ప్రాజెక్టు (1350 మెగావాట్లు) సామర్థ్యంతో చేపడుతోందని, వీటికి సంబంధించిన పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలంటూ సీఎం విజ్ఞప్తి చేశారు.

బ్రెజిల్ కమ్యూనిస్టు నేత ఇవాన్ పిన్హైరోకు మెక్సికో సన్మానం

మెక్సికో: బ్రెజిల్ కమ్యూనిస్టు పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి ఇవాన్ పిన్హైరోను మెక్సికో కమ్యూనిస్టు పార్టీ (పీసీఎం) ప్రతిష్ఠాత్మక మెడల్‌తో సన్మానించింది. బ్రెజిల్‌లో, లాటిన్ అమెరికాలో కమ్యూనిస్టు ఉద్యమాలకు అందించిన తోడ్పాటుకుగాను ఆయనను 'డేవిడ్ అల్ఫరో సిక్విరోస్ మెడల్ ఫర్ రెవల్యూషనరీ మెరిట్' వరించింది. 2022 డిసెంబరు 17న మెక్సికో కమ్యూనిస్టు పార్టీ ఏడవ మహాసభ జరిగిన సందర్భంగా ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని ఇవాన్ పిన్హైరో అందుకున్నారు. 2005 నుంచి 2016 వరకు బ్రెజిల్ కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన ఇవాన్ వృత్తిరీత్యా న్యాయవాది. 2010లో బ్రెజిల్ అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేశారు. ప్రముఖ కమ్యూనిస్టు కుడ్యచిత్రకారుడు డేవిడ్ అల్ఫరో సిక్విరోస్ పేరిట అవార్డును అందుకున్న మొదటివ్యక్తిగా ఇవాన్ పిన్హైరో నిలిచారు.

మోదీజీ.. మీరే దిక్కు

(మొదటిపేజీ తరువాయి)

జగన్, బుధవారం ప్రధానితో భేటీ అయ్యారు. సుమారు 50 నిముషాల పాటు వీరి భేటీ జరిగింది. ఈ సందర్భంగా వారిద్దరి మధ్య జరిగిన వాస్తవ చర్చలేంటో తెలియదు గాని, రాష్ట్రానికి సంబంధించిన అన్ని సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చినట్లు సమాచార శాఖ అధికారులు మీడియాకు విడుదల చేశారు. ఈ సమాచార ప్రకారం, రాష్ట్రానికి ప్రత్యేక తరగతి హోదా కల్పనపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని సీఎం కోరారు. విభజన వల్ల తీవ్రంగా నష్టపోయిన రాష్ట్రానికి ప్రత్యేక తరగతి హోదా అవశ్యమని, పార్లమెంటు వేదికగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని పునరుద్ఘాటించారు. 2014-15 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రీసోర్స్ గ్యాప్ ఫండింగ్ కింద చెల్లించాల్సిన బకాయిలు అలానే ఉన్నాయి. 2014-15కు సంబంధించిన రూ.18,330.45 కోట్ల బిల్లులు, 10వ వేతన సంఘం బకాయిలు, పెన్షన్లు మొదలైన వాటి రూపేణా మొత్తంగా రూ.32,625.25 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని వెంటనే మంజూరు చేయాలని సీఎం కోరారు. గత ప్రభుత్వం పరిమితికి మించి అధికంగా చేసిన రుణాలను, ఈ ప్రభుత్వంలో సర్దుబాటు చేస్తూ కేంద్ర ఆర్థిక శాఖ రుణాలపై పరిమితి విధిస్తోంది. కేటాయించిన రుణ పరిమితిలో కూడా కోతలు విధిస్తోంది. ఈ ప్రభుత్వం ఎలాంటి తప్పులు చేయనప్పటికీ గత ప్రభుత్వం చేసిన దానికి ఆంక్షలు విధిస్తోంది. కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితుల్లో ఈ ఆంక్షలు రాష్ట్రాన్ని బాగా దెబ్బతీస్తాయి. ఈ విషయంలో ప్రధాని జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తన సొంత నిధుల నుంచి ఖర్చు చేసిన రూ.2,937.92 కోట్లను వెంటనే చెల్లించాల్సిందిగా కోరారు. అలాగే పోలవరం ప్రాజెక్టు అంచనా వ్యయం ఖరారు అంశం కూడా ఇంకా పెండింగులోనే ఉంది. మొత్తం ప్రాజెక్టు కోసం 55,548 కోట్ల రూపాయలు అవుతుందని సాంకేతిక సలహా కమిటీ ఇప్పటికే ఆమోదించిన విషయాన్ని ప్రధాన మంత్రికి గుర్తుచేశారు. తాగునీటి సరఫరాను ప్రాజెక్టు నుంచి వేరుచేసి చూస్తున్నారని, దీనిని ప్రాజెక్టులో భాగంగా చూడాలని, దేశంలో జాతీయ హోదా పొందిన ఏ ప్రాజెక్టులోనైనా తాగునీటిని ప్రాజెక్టులో భాగంగా చూశారని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ వ్యయాన్ని కాంపోనెంట్ వైజ్‌గా చూస్తున్నారని, బిల్లుల రీయింబర్స్‌మెంట్‌లో తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని, ప్రాజెక్టు నిర్మాణం ఆలస్యం కావడమే కాకుండా, వ్యయం కూడా పెరుగుతుందని ప్రధానికి వివరించారు. ప్రాజెక్టు నిర్మాణ వ్యయాన్ని కాంపోనెంట్ వైజ్‌గా చూడొద్దని, ఆ నిబంధనలను పూర్తిగా తొలగించాలని అభ్యర్థించారు. ప్రాజెక్టు నిర్వాసితులకు సహాయ పునరావాస ప్యాకేజీని డీబీటీ ద్వారా చెల్లించడం ద్వారా సమయం ఆదా అవుతుందని తెలిపారు. వీలైనంత త్వరగా ఈ కార్యక్రమాన్ని పూర్తిచేయకపోతే ఆలస్యం అవుతున్నకొద్దీ ప్రాజెక్టు ఖర్చు పెరిగిపోతుందని తెలియజేశారు. పోలవరం ప్రాజెక్టు 41.15 మీటర్ల ఎత్తు వరకూ ఆయా కుటుంబాలను తరలించాల్సి ఉంటుందని, ఈ మేరకు పనులు చేయడానికి దాదాపు రూ.10,485.38 కోట్లు అవసరం అవుతుందని చెప్పారు. ఈ డబ్బును అడహాక్‌గా మంజూరు చేసినట్లయితే భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్ పనులు సకాలంలో పూర్తిచేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. తెలంగాణ డిస్కంల నుంచి రావాల్సిన రూ.6,886 కోట్ల విద్యుత్ బకాయిలను వెంటనే ఇప్పించాలని, తీవ్ర కష్టాల్లో ఉన్న ఏపీ జెన్‌కోకు ఈ బకాయిలు చాలా అవసరమన్నారు. జాతీయ ఆహార భద్రతా చట్టంలో నిబంధనలు హేతుబద్ధంగా లేవని, దీనివల్ల రాష్ట్రానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని ప్రధాని దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్రంలో అర్హత ఉన్న 56 లక్షల కుటుంబాలు పీఎంజీకేఏవై కింద లబ్ధి పొందడం లేదని, వీరికి రాష్ట్ర ప్రభుత్వమే సొంతంగా అందిస్తోందని, రూ.5,527 కోట్లను రాష్ట్ర ప్రభుత్వమే ఖర్చు చేసిందని ప్రధానికి వివరించారు.

77 వేల టన్నులు బియ్యం రాష్ట్రానికి కేటాయిస్తే అర్హులందరికీ ఆహార భద్రతా చట్టం వర్తింపు చేసినట్టువుతుందని, ఈ మేరకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇక జిల్లాల పునర్విభజన తర్వాత వాటి సంఖ్య 26కు చేరిందని, కేంద్రం కొత్తగా మంజూరు చేసిన 3 కళాశాలలతో కలుసుకుని ఇప్పటికి 14 వైద్య కళాశాలలు మాత్రమే ఉన్నాయని, మిగిలిన 12 జిల్లాలకు వెంటనే వైద్య కళాశాలలు మంజూరు చేయాలని కోరారు. కడపలో నిర్మించనున్న స్టీల్‌ప్లాంట్‌కు సరిపడా ఖనిజాన్ని అందుబాటులో ఉంచడానికి ఏపీఎండీసీకి గనులు కేటాయించాలని, విశాఖలో 76.9 కిలోమీటర్ల మేర మెట్రో రైల్ ఏర్పాటుకు సంబంధించి ఇప్పటికే డీపీఆర్‌ను సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి సమర్పించామని, ఈ ప్రాజెక్టుకు కావాల్సిన సహాయ సహకారాలు అందించాలని సీఎం కోరారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ అంశం మాత్రం వీరి చర్చల్లో ప్రస్తావనకు నోచుకోలేదు. ప్రధానితో భేటీ అనంతరం కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌తో, రాత్రి పొద్దుపోయిన తర్వాత కేంద్ర హోం మంత్రి అమిత్ షాతోనూ సీఎం జగన్ భేటీ అయ్యారు.

పేదరికం పైపైకి...

(మొదటిపేజీ తరువాయి)

సంఖ్య పెరుగుతోందేగానీ తగ్గబోదు. ఐదు కేజీల చొప్పున ఉచితంగా ఆహార ధాన్యాలు పంపిణీ చేసినా...రాయితీ ధరకు లభించే ఆహార ధాన్యాలు అందుబాటులో లేక తమకు అవసమైన 64శాతం ఆహార ధాన్యాలను అధిక ధరలకు మార్కెట్ల నుంచి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఆర్థికవృద్ధి శరవేగంగా జరుగుతుందని మోదీ సర్కార్ గొప్పలు పోతున్న వేళ...దేశంలో ఇంత భారీగా పేదలు ఎందుకు ఉన్నారు? అన్న ప్రశ్న రాక మానదు. 81 కోట్ల మంది పేదలు ఉన్నట్లు ప్రభుత్వమే అంగీకరించింది. దీని ప్రకారం వృద్ధి నత్తనడకన సాగుతుండాలి...లేదంటే సంఘటిత రంగంపైనే పూర్తిగా దృష్టి కేంద్రీకరించైనా ఉండాలి. వాస్తవానికి ఈ రెండూ జరుగుతున్నాయి. దేశంలో వనరుల కొరత లేదుగానీ...కొద్దిమంది సంపన్నులపైనే దృష్టి పెట్టడం వల్ల పేదలకు సబ్సిడీల్లో కోతలు విధించడం... రాయితీలు పెంచుతూ కార్పొరేట్లకు ప్రభుత్వం ఊడిగం చేస్తోంది. ఇది ఎంతవరకు సమంజసం అన్నది కేంద్రప్రభుత్వమే ఆత్మవిమర్శ చేసుకోవడం మంచిది.

81 కోట్ల మంది పేదలకు ఉచితంగా ఆహార ధాన్యాలు పంపిణీ ఇకపై జాతీయ ఆహార భద్రతా చట్టం (ఎన్ఎఫ్ఎస్ఏ) కింద మరో ఏడాది జరుగుతుంది కానీ ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన (పీఎంజీకేవై) కింద పంపిణీ ఉండబోదని కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. కోవిడ్ లాక్‌డౌన్ సమయంలో గ్రామీణ జనాభాలో 75శాతం, పట్టణాల్లో 50శాతం మందికి సబ్సిడీ ధరలకు ఆహార ధాన్యాలు ఈ పథకాల కింద అందాయి. 80 కోట్ల మంది పేదలకు కేజీ బియ్యం రూ.3, కేజీ గోధుమలు రూ.2, కేజీ ముతక ధాన్యం రూ.1 చొప్పున ఇచ్చినట్లు ఎన్ఎఫ్ఎస్ఏ అధికారిక వెబ్‌సైట్ పేర్కొంది. ఈ రెండు పథకాలతో ఆహార సబ్సిడీ 2021-22లో రూ.2.8 లక్షలకోట్లకు చేరినట్లు బడ్జెట్ పత్రాలు వెల్లడించాయి. 2019-20లో అంటే పీఎంజీకేవై పథకాన్ని ప్రారంభించక ముందు ఆహార సబ్సిడీ రూ.1.09 లక్షల కోట్లుగా ఉండేది. ప్రస్తుతం రెండు పథకాలను ఎన్ఎఫ్ఎస్ఏ కింద విలీనం చేశారు. 81 కోట్ల మంది పేదలకు ఉచితంగా ఐదు కేజీల ఆహార ధాన్యాలు ఇస్తామన్నారు. అవి పీఎంజీకేవై కింద పంపిణీ జరుగుతుంది. ఎన్ఎఫ్ఎస్ఏ కింద రాయితీ ధరలకు లభించడం లేదు. దీంతో ప్రభుత్వానికి రూ.1.09లక్షల కోట్ల సబ్సిడీ మొత్తం ఆదా అవుతుంది. కానీ పేదలపై అదనపు భారం పడుతుంది. ప్రజా పంపిణీ వ్యవస్థ ధరల కంటే ఎంతో ఎక్కువ ధరలు వెచ్చించి పేదలు మార్కెట్ నుంచి ఆహార ధాన్యాలు కొనుగోలు చేయాల్సి వస్తుంది. 2022లో గోధుమ ఉత్పత్తి, సేకరణపై ఆంక్షలు, వర్షాభావం-వరదలతో వరి పంటకు నష్టం వచ్చింది.

మార్కెట్ల నుంచి ఏ మేరకు కొనుగోళ్లు జరుగుతాయి?

81 కోట్ల మందికి 100 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాలు అవసరం కాగా ఉత్పత్తి 316 మిలియన్ల టన్నులు. అంటే 60శాతం జనాభాకు 32 శాతం ఆహార ధాన్యాలు ప్రభుత్వం అందిస్తోంది. మిగిలిన అవసరాలకు మార్కెట్‌పై ఆధారపడక తప్పదు. ఈ మేరకు 2011-12-వినియోగ సర్వే చెబుతోంది. ఆర్థిక సర్వే ప్రకారం 2019-20 (మహమ్మారికి పూర్వం) ఒక్కొక్కరికి సగటున 13.9కేజీల తృణధాన్యాలు లభించేవి. అంతకుముందు ఒక వ్యక్తి నెలకు 3.9 కేజీల ఆహార ధాన్యాలు మార్కెట్ నుంచి కొనుగోలు చేస్తే ఇప్పుడు 8.9 కేజీలు కొనుగోలు చేయాల్సి వస్తుంది. ప్రస్తుతం క్వింటా గోధుమలు రూ.2,500 పలుకుతుండగా ఐదుగురి కుటుంబానికి నెలసరి రూ.575 ఖర్చవుతుంది. పీఎంజీకేవై కింద పేదలకు లభించే పప్పులు ఇక్కడ లెక్కలోకి తీసుకోలేదు. అయితే వాటి సరఫరా కూడా ఇప్పుడు నిలిచిపోయింది. దీంతో పేదరికం పెరుగుతుంది. కోవిడ్ మహమ్మారి కారణంగా పని/ఆదాయాలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

పేదల సంఖ్య ఎంత?

భారత్‌లో 81 కోట్ల మంది పేదలు ఉన్నారని ప్రభుత్వం చెబుతోంది. ప్రపంచ బ్యాంకు దారిద్ర్య రేఖ పరిధిని రోజుకు 1.9 దాలర్ల నుంచి 2.15 దాలర్లకు అంటే రూ.143 నుంచి రూ.176కి పెంచడంతో నెలకు రూ.2,650 వరకు ఉంటుంది. దీనిని బట్టి ఐదుగురు ఉన్న కుటుంబానికి నెలకు రూ.13,250 వరకు ఖర్చు అవుతుంది. అయితే దిల్లీ సామాజిక ఆర్థిక సర్వే-2018 ప్రకారం దేశంలో అన్నిస్థాయిల్లో 90 శాతం కుటుంబాలు రూ.10వేలకు మించి ఖర్చు చేయలేవని వెల్లడైంది. ఈ-శ్రమ పోర్టల్ కింద నమోదు చేసుకున్న 94 శాతం మంది నెలసరి ఆదాయం రూ.10వేల కంటే తక్కువగా ఉంది. కుటుంబంలో ఇద్దరు పనిచేసినా ఆదాయం రూ.20వేలకు మించదు. ఈ లెక్కన అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం భారతీయుల్లో 90 శాతం పేదలే ఉన్నారని స్పష్టమవుతుంది. సంపన్నులకు రాయితీలు ప్రకటిస్తూ పేదలకు సబ్సిడీల్లో కేంద్రప్రభుత్వం కోతలు విధిస్తుండటంతో అనేక కుటుంబాలు దారిద్ర్య రేఖ దిగువనే ఉంటున్నాయి.

చంద్రబాబు సభలో అపశృతి

(మొదటిపేజీ తరువాయి)

తోపులాట జరిగింది.గుండంకట్ట ఔట్‌లెట్‌లో కొందరు టీడీపీ కార్యకర్తలు జారిపడిపోయారు.

లోకేశ్ దిగ్భ్రాంతి

చంద్రబాబు పర్యటనలో అపశ్రుతి తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ పేర్కొన్నారు. తమ కుటుంబ సభ్యులైన టీడీపీ కార్యకర్తల మృతి పార్టీకి తీరనిలోటని ట్విట్టర్ వేదికగా సంతాపం ప్రకటించారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించే ఏర్పాట్లు చేశామని, వారంతా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని తెలిపారు.

ఆంధ్రరత్నభవన్‌లో కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విజయవాడ ఆంధ్రరత్నభవన్‌లో బుధవారం ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. రాష్ట్ర కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్ ముఖ్య అతిధిగా పాల్గొని, పార్టీ జెండాను ఎగురవేశారు. స్వాతంత్ర్య సాధనలో అసువులు బాసిన అమరవీరులకు నేతలు నివాళులర్పించారు. మస్తాన్‌వలి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే పరమావధిగా పనిచేస్తూ కుల మతాలకు అతీతంగా కాంగ్రెస్ పుట్టిందని పేర్కొన్నారు. నేటి ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి, కుల, మతాల ప్రాతిపదికన రాజకీయాలు చేస్తూ ప్రజల మధ్య, ప్రాంతాల మధ్య చిచ్చుపెడుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ నగర కాంగ్రెస్ అధ్యక్షులు నరహరిశెట్టి నరసింహరావు, పీసీసీ లీగల్ సెల్ చైర్మన్ వి.గుర్నాథం, ఆర్టీఐ సెల్ చైర్మన్ పీవై కిరణ్, కొలనుకొండ శివాజీ తదితరులు పాల్గొన్నారు.

సైన్యంలో ఏడాది పని చేయాల్సిందే: తైవాన్ ఆదేశం

తైపీ: పౌరులంతా కచ్చితంగా ఏడాది పాటు సైన్యంలో పనిచేయాల్సిందేనని తైవాన్ తాజా అదేశాలు జారీచేసింది. సైన్యాన్ని మరింత పటిష్టం చేసుకునే చర్యలు చేపట్టింది. ఇప్పటివరకు నాలుగు నెలలు సైన్యంలో పనిచేస్తే సరిపోయేది. కానీ తైవాన్-చైనా మధ్య ఉద్రిక్తతల దృష్ట్యా పౌరుల మిలటరీ సర్వీసు కాలాన్ని ఏడాదికి పెంచుతూ కీలక నిర్ణయాన్ని తైవాన్ తీసుకున్నది. 'యుద్ధం కావాలని ఎవరూ కోరుకోరు. కానీ మన పక్క దేశం అలా కాదు. శాంతి అనేది ఆకాశం నుంచి ఊడిపడదు' అని తైవాన్ అధ్యక్షులు సై ఇంగ్ వెన్ అన్నారు.

త్వరలో కొత్త ఐటీ పాలసీ

- విశాఖకు యాంకర్ ఐటీ కంపెనీలు
- ఫిబ్రవరిలో ఐటీ ప్రోత్సాహకాల విడుదల
- మంత్రి అమర్నాథ్ వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో కొత్త ఐటీ పాలసీ తీసుకురానుందని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ తెలిపారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 16, 17 తేదీలలో విశాఖలో నిర్వహించనున్న గ్లోబల్ టెక్ సమ్మిట్ ఏర్పాట్లు తదితర అంశాలపై పల్సస్ గ్రూప్ లిమిటెడ్ సీఈవో గేదెల శ్రీనుబాబు నేతృత్వంలో బుధవారం సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి అమర్నాథ్ మాట్లాడుతూ ఐటీ రంగంలో హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాలతో విశాఖ పోటీపడుతోందన్నారు. రానున్న ఏడాది కాలంలో విశాఖ నగరానికి ఐటీ దిగ్గజ కంపెనీలు రాబోతున్నాయని వివరించారు. విశాఖను బీచ్ ఐటీకి గమ్యస్థానంగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయించారన్నారు. ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ప్రభుత్వం అందించే సహాయ సహకారాలను ఐటీ కంపెనీలకు తెలియజేసే ఉద్దేశంతోనే జనవరి నుంచి ఏప్రిల్ వరకు అనేక జాతీయ, అంతర్జాతీయ సదస్సులతోపాటు గ్లోబల్ టెక్ సదస్సును విశాఖలో నిర్వహిస్తున్నామని మంత్రి అమర్‌నాథ్ చెప్పారు. జనవరి 6,7,8 తేదీలలో విశాఖలో హెల్త్ సమ్మిట్ జరగబోతుందని, అదే నెల 20, 21 తేదీలలో ఇన్ఫినిటీ ఐటీ సదస్సు నిర్వహిస్తామన్నారు. ఫిబ్రవరి మూడు, నాలుగు తేదీలలో జి 20 సదస్సు, మార్చి మూడు, నాలుగు తేదీలలో ప్రపంచ పెట్టుబడుల సదస్సును విశాఖలో జరుపుతామన్నారు. ఈ సదస్సుల వల్ల విశాఖ నగరం అంతర్జాతీయ గుర్తింపు పొందుతుందని చెప్పారు. ఒకటి, రెండు నెలల్లో ఇన్ఫోసిస్ తన కార్యకలాపాలు ప్రారంభిస్తుందని, అమెజాన్ త్వరలోనే విశాఖలో అడుగుపెట్టబోతుందని, హెచ్‌సీఎల్... విశాఖపట్నం, తిరుపతి, కాకినాడ, గుంటూరులలో ఇప్పటికే కార్యకలాపాలు ప్రారంభించిందని వివరించారు. ఐబీఎంను విశాఖ తీసుకొచ్చేందుకు చర్చలు జరుపుతున్నామన్నారు. ఐటీ రంగానికి చెందిన యాంకర్ యూనిట్లు విశాఖకు వస్తే, ఐటీ హబ్బులుగా పేరొందిన వివిధ నగరాల సరసన విశాఖ నిలుస్తుందని అమర్నాథ్ చెప్పారు. విశాఖ వాతావరణం ఐటీ ఉద్యోగులకు అనుకూలంగా ఉంటుందన్నారు. వివిధ దేశాలలో పనిచేస్తున్న ఐటీ ఉద్యోగులలో 14 శాతం మంది తెలుగు వారే ఉన్నారని, అందులో తొమ్మిది శాతం ఆంధ్రప్రదేశ్ వారే కావడం గమనార్హమన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఎంఎస్ఎంఈలతోపాటు ఐటీ ప్రోత్సాహాలను విడుదల చేస్తామని మంత్రి అమర్నాథ్ చెప్పారు. గేదెల శ్రీనుబాబు మాట్లాడుతూ గ్లోబల్ టెక్ సమిట్‌కు 1000 మంది ప్రతినిధులు హాజరయ్యే అవకాశం ఉందని చెప్పారు. దీనికోసం ఇప్పటికే భువనేశ్వర్, ఢిల్లీ, హైదరాబాద్‌లో రోడ్ షోలు నిర్వహించామని చెప్పారు.

ఉద్యోగులపై ఒత్తిడి వద్దు

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంస్థ వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రజలకు అవసరం మేరకు పౌర సేవలందిస్తున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులపై టార్గెట్లతో అధికారులు ఒత్తిడి పెంచడం వల్ల తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు, ప్రధాన కార్యదర్శి వైవీ రావు అధ్వర్యంలో గ్రామ, వార్డు సచివాలయ విభాగం రాష్ట్ర కమిషనర్ షాన్ మోహన్, అదనపు కమిషనర్ తోట కైలాశ్ గిరీశ్వర్‌కు సంస్థ రాష్ట్ర కమిటీ పక్షాన వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్ పేరును విలేజ్ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ సెక్రటరీగా తక్షణమే మార్చాలని కోరారు. మహిళా సంరక్షణ కార్యదర్శులకు రాత్రి విధులు, బందోబస్త్, ఎస్కార్ట్, పోస్టు మార్టం విధులు వేయకుండా ప్రభుత్వం ఉత్తర్వులివ్వాలని డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో టార్గెట్ల వత్తిడి తట్టుకోలేక కొంత మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వివరించారు. మానసిక ఒత్తిడి తగ్గించి జాబ్ చాట్ ప్రకారం ఆరోగ్యకర వాతావరణంలో ఉద్యోగులు విధులు నిర్వహించేలా చూడాలని విన్నవించారు. ఫీల్డ్ వర్కర్లకు బయోమెట్రిక్ అమలులో వెసులు బాటు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ పునరుద్ధరించాలి

జగన్‌కు రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ పునరుద్ధరణకు తగిన చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బుధవారం ఆయన లేఖ రాశారు. దళిత, గిరిజన వర్గాల అభ్యున్నతి కోసం 2013లో నాటి ప్రభుత్వం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభలో చర్చించి, పదేళ్ల కాలపరిమితితో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని రూపొందించింది. నాటి నుంచి ఈ చట్టం అమలులో చాలా ఒడిదుడుకులు, లోపాలు వెలుగుచూశాయి. 2023 జనవరి నాటికి ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం కాలపరిమితి ముగుస్తుంది. కాలపరిమితి లేకుండా దళిత, గిరిజనుల అభివృద్ధికి దోహదపడే ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని మరింత సమర్థవంతంగా రూపొందించి పునరుద్ధరించేందుకుగాను, సక్రమంగా అమలు చేసేందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని రామకృష్ణ కోరారు.

అసైన్డ్ భూములు కాంట్రాక్టర్లకు కట్టబెట్టొద్దు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దళితులకు కేటాయించిన అసైన్డ్ భూములను ఏ పేరుతో అన్యాక్రాంతమైనా వాటిని తిరిగి వారికే అప్పగించాలని, కాంట్రాక్టర్లకు కట్టబెట్టే విధానాలను ఆపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. చాలాచోట్ల పేదలకిచ్చిన అసైన్డ్ భూములను కాజేసేందుకు గద్దల్లా వాలుతున్న మాఫియాకు పోలీసు, రెవెన్యూ యంత్రాంగం కొమ్ము కాయడాన్ని తీవ్రంగా ఖండించారు. అసైన్డ్ భూముల సవరణ చట్టం తేవాలన్న ప్రయత్నాల్ని తమ పార్టీ వ్యతిరేకిస్తోందన్నారు. చిలకలూరిపేట మండలంలో చాలా గ్రామాల్లో ప్రభుత్వం దళితులకు అసైన్డ్ భూములు ఇచ్చిందనీ, ఆ భూములను దళితులు సాగు చేసుకునే జీవిస్తున్నారని వివరించారు. ఆ భూముల్లో మైనింగ్ ఉన్నదని చెప్పి నేడు సాగుదారులను భూముల్లోకి వెళ్లకుండా రెవెన్యూ అధికారులు , పోలీసులు అడ్డుకోవడం సరికాదని, దళితుల పోరాటం సరైనదేనని హైకోర్టు జోక్యంతో రుజువైందని పేర్కొన్నారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా భూములు తిరిగి స్వాధీనం చేసుకోవడం సరికాదని కోర్టు సూచనను హర్షిస్తున్నామన్నారు. ఇదే మండలంలోని ఎడవల్లి గ్రామంలో దాదాపు 50ఏళ్ల క్రితం 416ఎకరాలు దళితులకు భూములు ఇచ్చారనీ, ఆ భూముల్లో మైనింగ్ ఉందని చెప్పి దళితులను ఆ భూముల్లో సాగు చేయడానికి రెవెన్యూ అధికారులు, పోలీసులు అడ్డగించడానికి సీపీఎం వ్యతిరేకిస్తోందన్నారు. అధికార పార్టీ నాయకులు, స్థానిక మంత్రి మద్దతుతో మైనింగ్ పేరుతో అక్రమంగా దళితుల భూములు కాజేయడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. మైనింగ్ లీజు కేటాయింపులను వ్యతిరేకిస్తే బీఫామ్ పట్టాలు రద్దు చేస్తామని బెదిరించడం దుర్మార్గమైన చర్యని పేర్కొన్నారు. రాష్ట్రంలో 9/77 చట్టం అమల్లో ఉన్నప్పటికీ...జగన్ ప్రభుత్వం ఆ చట్టాన్ని ఖాతరు చేయకుండా దళితులకు ఇచ్చిన అసైన్డ్ భూములను బలవంతంగా గుంజుకుంటోందన్నారు. అభివృద్ధి పేరుతో దళితుల భూములు లాగేయడం సరికాదని, అనివార్యమైతే 2013 భూ సేకరణ చట్ట ప్రకారం భూములు సేకరించాలని, లేదా పేదల సహకార సంఘాలకే మైనింగ్ లీజుకివ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట: పెద్దిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణకు సీఎం జగన్ అధిక ప్రాధాన్యతిస్తున్నారని పర్యావరణ, అటవీ, ఇంధన, సైన్స్, టెక్నాలజీ, గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. దేశంలోనే కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణలో రాష్ట్రం ముందంజలో నిలుస్తుందన్నారు. విజయవాడ ఆంధ్రప్రదేశ్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్ మెంట్ కార్పొరేషన్ (ఏపీఈఎంసీఎల్) కార్యాలయంలో పర్యావరణ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్, కార్పొరేషన్ ఎండీ ఖజూరియా, చైర్మన్ గుబ్బా చంద్రశేఖర్‌తో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. కాలుష్య కారక వ్యర్థాల నిర్వహణకు సంబంధించి కొత్తగా ఏర్పాటు చేసిన పోర్టల్‌ను ఆయన ప్రారంభించారు. పెద్దిరెడ్డి మాట్లాడుతూ థర్మల్ పవర్‌స్టేషన్ల నుంచి ఉత్పత్తి అవుతున్న ఫ్లైయాష్ నిర్వహణను ఇకపై ఏపీ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ పరిధిలోకి తీసుకువస్తూ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పది థర్మల్ పవర్ ప్లాంట్ల ద్వారా ఉత్పత్తి అవుతున్న ఫ్లైయాష్‌పై పూర్తిస్థాయిలో పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా ఒక ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రారంభించామని, ఈ పోర్టల్‌లో ఫ్లైయాష్ ఉత్పత్తి, కొనుగోలుదారులు, రవాణాదారులకు సంబంధించిన పూర్తి సమాచారం ఉంటుందని మంత్రి వివరించారు. దీనివల్ల సిమెంట్ కంపెనీలు, టైల్స్, రెడీమిక్స్ కంపెనీలు, జాతీయ రహదారుల నిర్మాణం, ఫ్లైయాష్‌తో ఇటుకలు తయారు చేసే పరిశ్రమలు, ఈ ఫ్లైయాష్‌ను రవాణా చేసే సంస్థలు అన్నీ ఒకే వేదిక మీదకు వస్తాయన్నారు. అటు పరిశ్రమలకు, ఇటు థర్మల్ ప్లాంట్లకు ఈ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా మేలు జరుగుతుందని, మరోవైపు ఫ్లైయాష్ వినియోగం కూడా పూర్తిగా పర్యావరణ నిబంధనల మేరకు జరిగేలా పర్యవేక్షించేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. పరిశ్రమలను ప్రోత్సహించడంతో పాటు కాలుష్య నియంత్రణకు, వ్యర్థాల నిర్వహణకు ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలన్న ఉద్దేశంతో సీఎం జగన్ 2019లో ఏపీఈఎంసీఎల్‌ను ప్రారంభించారని గుర్తుచేశారు. ఈ కార్పొరేషన్ ద్వారా వివిధ పరిశ్రమల ద్వారా విడుదల అవుతున్న వ్యర్థాలను ప్రమాదరహితంగా మార్చడం, వాటిని తిరిగి వినియోగంలోకి తీసుకురావడం, వ్యర్థాలను డిస్పోజ్ చేయాల్సిన పరిస్థితుల్లో వాటిని ఏ రకంగా చేస్తున్నారనే అంశాలను పర్యవేక్షించడపై దృష్టి సారించామన్నారు. కార్పొరేషన్ పరిధిలో ఇప్పటివరకు 983 వ్యర్థాలను సృష్టించే సంస్థలు నమోదయ్యాయని వివరించారు. కార్పొరేషన్ ద్వారా 8.32లక్షల మెట్రిక్ టన్నుల ఘన వ్యర్థాలను తిరిగి వినియోగించుకునేందుకు చర్యలు తీసుకున్నామన్నారు.

ఐక్యపోరాటాలతోనే హక్కుల పరిరక్షణ

కొండలరావు, సోమసుందర్ పిలుపు

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: ఐక్యపోరాటాల ద్వారానే కార్మికవర్గ హక్కుల పరిరక్షణ సాధ్యమని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్, కోశాధికారి బీవీవీ కొండలరావు స్పష్టం చేశారు. స్థానిక సిపాయిపేట భవననిర్మాణ కార్మికసంఘం కార్యాలయంలో బుధవారం జరిగిన ఏఐటీయూసీ తాడేపల్లిగూడెం ఏరియా కమిటీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల కేరళలో జరిగిన ఏఐటీయూసీ జాతీయ మహాసభల తీర్మానాలను, నిర్ణయాలను నాయకులు వివరించారు. డి.సోమసుందర్ సమావేశానికి అధ్యక్షత వహించారు. కొండలరావు మాట్లా డుతూ 29 కార్మికచట్టాలను నాలుగు కోడ్లుగా మార్చ డంతో కార్మికులు ప్రాథమిక హక్కులు కోల్పోయారని, పట్టుదలతో విశాల ఐక్యపోరాటాన్ని కొనసాగించి హక్కులు కాపాడుకోవాలని జాతీయ మహాసభ పిలుపు ఇచ్చిందని వివరించారు. సోమసుందర్ మాట్లాడుతూ మహాసభలో కేంద్ర కార్మిక సంఘాల జాతీయ నాయకులు పాల్గొన్నారని, భారతీయ కార్మికోద్యమంలో ఏఐటీయూసీ ప్రత్యేక ప్రాధాన్యాన్ని ప్రశంసించారని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో ఏఐటీయూసీకి గల గౌరవం మహాసభ సందర్భంగా మరోసారి వ్యక్తమైందని సోమసుందర్ వివరించారు. జనవరి 30న న్యూఢిల్లీలో జరగనున్న కార్మికసంఘాల మహాసదస్సులో అన్ని కేంద్ర కార్మిక సంఘాలు పాల్గొంటున్నాయని తెలిపారు. కార్మికహక్కుల పరిరక్షణ కోసం చేపట్టాల్సిన భవిష్యత్ కార్యాచరణను మహాసదస్సులో ప్రకటిస్తారని వివరించారు. ఏఐటీయూసీ ఏరియాకమిటీ కార్యదర్శి ఓసూరి వీర్రాజు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళింగ లక్ష్మణరావు, నాయకులు బడబళ్ల లక్ష్మీనారాయణ, ఉల్లింకల జయకృష్ణ, పాలూరి లక్ష్మణరావు, అంకం భాస్కరరావు, మెండెం జేమ్స్, పడాల శ్రీనివాస్, పోలిరాతి ఆదినారాయణ, దువ్వా శ్రీనివాస్, కె.ముత్యం, కె.కాటమరాజు, అల్లం నరేంద్ర, కళింగ శ్రీను, రాజేశ్, తాడేపల్లి వెంకటేశ్, కె.ఏడుకొండలు, మాదాసు సత్యనారాయణ, కర్రి వీరవెంకట సత్యనారాయణ, మేళం నాగరాజు పాల్గొన్నారు.

'వైకుంఠ' దర్శనానికి పటిష్ఠ ఏర్పాట్లు

ఒకటో తేదీ నుంచి అన్నప్రసాద వితరణ

విశాలాంధ్ర-తిరుమల: వైకుంఠ ద్వార దర్శనానికి పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి బుధవారం తెలిపారు. జనవరి 1 నుంచి 11వ తేదీ వరకు భక్తుల దర్శనాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తిరుమలలోని వైకుంఠం క్యూకాంపెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లు, సర్వదర్శనం క్యూలైన్లు, పీఏసీ-4 తదితర ప్రాంతాల్లో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లను టీటీడీ అదనపు ఈవో (ఎఫ్ఏసీ) వీరబ్రహ్మంతో కలిసి సుబ్బారెడ్డి పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, వైకుంఠ ఏకాదశి సందర్భంగా దర్శనానికి వచ్చే భక్తుల కోసం వైకుంఠం క్యూకాంప్లెక్సు, నారాయణగిరి షెడ్లు, ఇతర ప్రాంతాల్లో అన్నప్రసాదాలు, తాగునీరు, టీ, కాఫీ పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. టైంస్లాట్ టోకెన్లు పొంది వైకుంఠ ద్వార దర్శనానికి రావాలని భక్తులకు సూచించారు. జనవరి 1-11 తేదీల్లో బ్రేక్ దర్శనాలకు వీఐపీల సిఫార్సులు స్వీకరించమన్నారు. వీఐపీలు వస్తే వారికి బ్రేక్ దర్శనాలు కల్పిస్తామన్నారు. కోవిడ్ ముప్పు దృష్ట్యా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాల మేరకు అందరికీ మాస్కులు తప్పనిసరని అన్నారు. తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం కాంప్లెక్స్, ప్రధాన కళ్యాణకట్ట ఎదురున్న పీఏసీ-4లో అన్నప్రసాద వితరణ ఉంటుందని చెప్పారు. సుబ్బారెడ్డి వెంట ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖ్ కుమార్, ఎస్ఈ-2 జగదీశ్వర్‌రెడ్డి, ఆరోగ్యశాఖాధికారి శ్రీదేవి, వీజీఓ బాలిరెడ్డి ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలు దుర్మార్గం

685వ రోజుకు ఉక్కు దీక్షలు

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: ప్రభుత్వ రంగ పరిశ్రమలను నిర్వీర్యం చేస్తే సహించేది లేదని, కేంద్ర ప్రభుత్వ విధానాలు దుర్మార్గమని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆది నారాయణ, పోరాట కమిటీ నాయుకులు జె.రామకృష్ణ, బి.డేవిడ్, చిత్రాడ సన్యాసిరావు, గుమ్మడి నరేంద్ర అన్నారు. కూర్మన్నపాలెం జంక్షన్‌లో విశాఖ స్టీల్ ప్లాంట్ విక్రయానికి వ్యతిరేకంగా కొనసాగుతున్న రిలే దీక్షలు గురువారం నాటికి 685వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో ఉక్కులోని ఎల్.ఎం, ఎంఎం, ఎస్ బి.ఎం విభాగాల కార్మికులు పాల్గొన్నారు. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతోందని, ఈ కుట్రలను కార్మిక ఉద్యమాల ద్వారా అడ్డుకుంటామన్నారు. దేశ స్వాతంత్ర్యం తర్వాత ప్రభుత్వ రంగ పరిశ్రమల వల్ల దేశంలో ఆర్థికపురోభివృద్ధి జరిగిందని, ఇది దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ రంగం పట్ల మరొకసారి పునరా లోచించాలని ముఖ్యంగా ప్రభుత్వ రంగ సంస్థల వలన మాత్రమే ప్రభుత్వానికి టాక్స్ వస్తుందని తెలిపారు. భారతదేశం లాంటి అత్యధిక జనాభా కలిగిన దేశంలో నిరుద్యోగ యువతకు ఉపాధి చూపించేది ప్రభుత్వ రంగమేనని, అందువల్ల ప్రభుత్వ రంగం సంస్థలు కొనసాగాలన్నారు. భూములు ఇచ్చిన నిర్వాసి తులకు న్యాయం జరగాలంటే విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలో కొనసాగిం చాలని డిమాండ్ చేశారు. దీన్ని రక్షించుకోవడం కోసం ఎలాంటి త్యాగాలకైనా సిద్ధమన్నారు. డిపార్ట్‌మెంట్ కమిటీ నాయుకులు వి.సీతారామరాజు, కాండ్రేగుల భాస్కర్, కె.సుబ్బరాజు, కె.వి.రవికుమార్ పాల్గొన్నారు.

జనవరిలో లోకేశ్ 'యువగళం'

- 400 రోజుల్లో 4 వేల కిమీల పాదయాత్ర
- కుప్పం నుంచి ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఎన్నికల సమరానికి తెలుగుదేశం పార్టీ సిద్ధమవుతోంది. ముందస్తు ఎన్నికలకు వైసీపీ సిద్ధపడుతున్న నేపథ్యంలో టీడీపీ వేగం పెంచుతోంది. 2014 ఎన్నికల ముందు 'మీకోసం' పేరుతో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు పాదయాత్ర నిర్వహించగా, వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ఆ పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేశ్ 'యువగళం' పేరుతో పాదయాత్ర చేపట్టనున్నారు. చంద్రబాబు సొంత నియోజకవర్గమైన కుప్పం నుంచి జనవరి 27న పాదయాత్ర ప్రారంభించాలని నిర్ణయించారు. 2024లో అసెంబ్లీ ఎన్నికలు జరిగినా అప్పటివరకు పాదయాత్రను కొనసాగించడానికి వీలుగా 400 రోజుల పాటు, 4వేల కిలోమీటర్లు దాదాపు అన్ని నియోజకవర్గాలను కలుపుతూ నడిచేలా కార్యాచరణను సిద్ధం చేశారు. బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో యువగళం పోస్టర్లు, ప్రచార చిత్రాలు, జెండాలను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు అధ్యక్షతన ఆవిష్కరించారు. యాత్రలో భాగంగా లోకేశ్ ప్రజలను కలిసి వారి ఇబ్బందులు తెల్సుకుంటారని, వైసీపీ పాలనలో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని, ప్రభుత్వ అవినీతిని వారికి వివరిస్తారని అచ్చెనాయుడు తెలిపారు. లోకేశ్‌తో కలిసి పాదయాత్రలో పాల్గొనాలనుకునే వారు 9686296862 నంబర్‌కి మిస్డ్‌కాల్ ఇవ్వాలని సూచించారు. యువగళం కామ్‌పై సైనప్ చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీమంత్రి చినరాజప్ప, నక్కా ఆనందబాబు, షరీఫ్, అనిత, నల్లారి కిషోర్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణ పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్టు బండారుకు ఘన సన్మానం

- ప్రభుత్వం తరపున సీనియర్ జర్నలిస్టులను గౌరవించడమే ధ్యేయం
- ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు

విశాలాంధ్ర-గుడివాడ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అధ్వర్యంలో సీనియర్ జర్నలిస్టు బండారు రాధాకృష్ణను ఘనంగా సత్కరించారు. బుధవారం స్థానిక ఎన్‌జీవో హోమ్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభకు జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్ అధ్యక్షత వహించారు. ఈ సన్మాన సభలో బండారు రాధాకృష్ణ తన పత్రికా రంగ అనుభవాలను వివరించారు. కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల పట్ల కొన్ని మీడియా సంస్థలు వ్యవహరిస్తున్న తీరు, తెలుసుకోవాల్సిన విషయాలు, ఆచరించాల్సిన విధివిధానాలన్నింటిని తేటతెల్లంగా తెలియజేశారు. ప్రతి ఒక్క రిపోర్టర్ కూడా నిజాన్ని నిర్భయంగా రాసి ప్రజలకు సేవ చేయాలన్నారు. లేనిపోని కల్పిత వార్తలు రాసి సమస్యలు తెచ్చుకోవద్దని సూచించారు. ప్రభుత్వం ద్వారా గుర్తింపబడిన కొంతమంది సీనియర్ జర్నలిస్టులను గౌరవించాలనే దృక్పథంతో ఈనాడు పత్రికలో పని చేసిన సీనియర్ జర్నలిస్టు బండారు రాధాకృష్ణను సత్కరించి ప్రభుత్వ గుర్తింపు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. అనంతరం అనేక మంది యూనియన్ నాయకులు జర్నలిస్టుల సమస్యలను కొమ్మినేని శ్రీనివాసరావు దృష్టికి తీసుకు వెళ్లారు. ఆయన వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రెస్ అకాడమీ కార్యదర్శి బాలగంగాధర్ తిలక్, రాష్ట్ర నాయకులు మత్తి శ్రీకాంత్, స్థానిక యూనియన్ల నాయకులు గూడపాటి రాజు, జి.శ్యాంబాబు, చాట్రగడ్డ విజయ్‌ప్రసాద్, ఆంజనేయులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు, బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

శ్వాస అందక చిన్నారి మృతి

విశాలాంధ్ర-జి మాడుగుల: శ్వాస అందక మూడు నెలల చిన్నారి మృతి చెందిన ఘటన చోటు జి మాడుగుల మండలంలో చోటుచేసుకుంది. జి.మాడుగుల పంచాయతీ ఉరుము గ్రామానికి చెందిన ఉల్లి సత్యారావు-గున్నమ్మ దంపతులకు ఇటీవలే చిన్నారి జన్మించింది. మూడు నెలల వయసున్న చిన్నారికి ఏటువంటి అనారోగ్యం లేదనీ, బాగానే ఆడుకుంటోందని, సోమవారం ఒక్కసారిగా అస్వస్థతకు గురైనట్లు దంపతులు తెలిపారు. దీంతో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా సిరప్ ఇచ్చి పంపించారని వారు తెలిపారు. సరైన వైద్యం చేసి ఉంటే తమ చిన్నారి బతికేదని, డాక్టర్ల నిర్లక్ష్యం వలనే చనిపోయిందని వారు వాపోయారు. అదే గ్రామానికి చెందిన వనగల కొండబాబు (11) సోమవారం మృతి చెందాడు. గ్రామంలో ఇదే నెలలో అడప మత్స్యా కొండం నాయుడు, కిముడు నారాయణరావు మృతి చెందారు. ఈ వరస మరణాలతో గ్రామంలో భయాందోళనలకు గురవుతున్నారు. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న ఈ గ్రామంలో ఏటువంటి సౌకర్యాలు లేకపోవడంతో గిరిజనలు అనారోగ్యం పాలై మృతి చెందుతున్నారు. ఉరుములో మంచినీటి సదుపాయం లేకపోవడంతో కలుషితమైన ఊట గడ్డల నుంచి నీరు తెచ్చుకొని అనారోగ్యం పాలవుతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో మంచినీటి సదుపాయం కల్పించాలని, మెడికల్ క్యాంపు నిర్వహించాలని, పారిశుధ్యం పనులు చేపట్టాలని కోరుతున్నారు.

నేరాలు తగ్గుముఖం

- ప్రభుత్వం పూర్తి సహకారం
- పోలీసింగ్‌లో వినూత్న ఒరవడి
డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మెరుగైన పోలీసింగ్‌తో 2022లో నేరాలు తగ్గుముఖం పట్టగా... మహిళలపై కుటుంబ హింస, సైబర్ నేరాలు మాత్రం కొంత మేరకు పెరిగాయని డీజీపీ రాజేంద్ర నాథ్ రెడ్డి వెల్లడించారు. దిశ కార్యక్రమాల పటిష్ఠ అమలు, నేర ప్రభావిత ప్రదేశాల జియో మ్యాపింగ్, మహిళా పోలీసుల పర్యవేక్షణ తదితర చర్యల ద్వారా మహిళలపై జరిగే తీవ్ర నేరాలు తగ్గుముఖం పట్టగా, కుటుంబ హింసకు సంబంధించిన నేరాలు కొంత మేర పెరిగాయని తెలిపారు. మంగళగిరి ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం డీజీపీ విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ-2022 పురోగతిని ఆయన వివరిస్తూ... 2020లో మానభంగాలు 1,255 నమోదు కాగా, 2021లో 1,456 కేసులు, 2022లో 1,419 కేసులు నమోదైనట్లు వివరించారు. వరకట్న హత్యలు, ఆత్మహత్య ప్రేరిత నేరాలు, కిడ్నాపులు, వరకట్న చావులూ తగ్గుముఖం పట్టాయన్నారు. మహిళలపై వేధింపులకు సంబంధించిన కేసులు 2020లో 7,039 నమోదు కాగా, 2021లో 10,373 కేసులు, 2022లో 11,895 కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. అవుట్ రీచ్ ప్రోగ్రాముల వల్ల ఎక్కువ కేసులు నమోదైనట్లు చెప్పారు. పోలీసు శాఖ సమర్థ వంతంగా పని చేయడం వల్లే 2022లో మొత్తంగా నేరాలు గణనీయంగా తగ్గాయని వివరించారు. ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం లభించడం, పోలీసింగ్‌లో వినూత్న ఒరవడిని సృష్టించడం వల్లనే ఇది సాధ్యమైందని, ద్విగుణీ కృత ఉత్సాహంతో 2023లో మరింత మెరుగైన పోలీసింగ్‌ను అందిస్తామని తెలిపారు. విజబుల్ పోలీసింగ్, అవగాహన కార్యక్రమాలతో పాటు మహిళా పోలీసు సేవల సమర్థవంత నిర్వహణ, పీడీ యాక్ట్ ప్రయోగం, నాటు సారాపై ఉక్కుపాదం మోపడం తదితర చర్యల వల్ల నేరాలు తగ్గుముఖం పట్టాయన్నారు. 2020లో నమోదైన కేసులు 2,92,565 కాగా, 2021లో 2,84,753, 2022లో 2,31,359 కేసులు నమోదైనట్లు తెలిపారు. విజబుల్ పోలీసింగ్, అసాంఘిక శక్తులపై నిఘా, పీడీ యాక్ట్ ప్రయోగం, తక్షణ అరెస్టులు, బైండోవర్ తదితర చర్యల వల్ల హత్యలు, కొట్లాటలు తగ్గుముఖం పట్టాయన్నారు. 2020లో నమోదైన హత్యలు 846 కాగా, 2021లో 945 హత్య కేసులు నమోదు కాగా, 2022లో 857 హత్య కేసులు నమోదైనట్లు తెలిపారు. 2022లో దొంగతనాల నమోదు 2021తో పోలిస్తే రమారమి అదే విధంగా ఉన్నాయన్నారు. 2020లో నమోదైన కేసులు 3,384 కాగా, 2021లో 4,093 నమోదు కాగా, 2022లో 4,242 కేసులు నమోదైనట్లు వివరించారు. 2020లో 17,391 రోడ్డు ప్రమాదాలు, 2021లో 19,203 ప్రమాదాలు జరుగగా, 2022లో 18,739 ప్రమాదాలు జరిగాయని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో సంభవించిన మరణాల సంఖ్య సైతం గణనీయంగా తగ్గిందని అన్నారు. ఎస్సీ, ఎస్టీలపై నేరాలను వివరిస్తూ... గ్రామ సందర్శనలు, నేర ప్రభావిత ప్రదేశాలను గుర్తించి నిఘా ఉంచడం, ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలు, జిల్లా సమీక్షా సమావేశాలు, నేరస్తుల పట్ల కఠినమైన చర్యలు చేపట్టడం ద్వారా తగ్గుముఖం పట్టాయని తెలిపారు. 2022లో కొంతమేర ఎక్కువగా సైబర్ నేరాలు నమోదయ్యా యన్నారు. 2020లో నమోదైన కేసులు 2,122 కాగా, 2021లో 2,039, 2022లో 2,783 కేసులు నమోదైనట్లు వెల్లడించారు. లోన్ యాప్ కేసుల విషయానికొస్తే, 1930 టోల్ ఫ్రీ నంబర్ వల్ల కేసుల నమోదు పెరిగినట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ అవగాహన కార్యక్రమాల నిర్వహణ, సైబర్, సోషల్ మీడియా సెల్స్ ఏర్పాటు ప్రక్రియతో కార్యాచరణ రూపొందిస్తామన్నారు. లోక్ అదాలత్ ద్వారా 1,08,763 కేసులను పెద్ద ఎత్తున పరిష్కరించినట్లు తెలిపారు. కన్విక్షన్ బేస్ పోలింగ్ విధానాన్ని ఈ సంవత్సరం జూన్ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్నామని అన్నారు.

సంపాదకీయం

అంతా రాజ్యాంగ బద్ధమేనట!

న్యాయ వ్యవస్థ మీద చేయకూడని యుద్ధం అంతా చేసేసిన కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు తమ ప్రభుత్వం సంపూర్ణంగా రాజ్యాంగ బద్ధంగానే నడుస్తుందని చెప్పారు. ప్రధానమంత్రి మోదీ రాజ్యాంగానికి నిబద్ధులై ఉన్నారు కనక మరో మాటకు తావులేదని కూడా సెలవిచ్చారు. న్యాయవ్యవస్థపై ఆధిపత్యం చెలాయించే ఆలోచనేదీ లేదన్నారు. న్యాయస్థానాలకు సెలవులు, కొలీజియం వ్యవస్థ మొదలైన వాటి మీద రిజిజు ఈ మధ్య కాలంలో విరివిగా మాట్లాడుతున్నారు. కొన్ని సందర్భాలలో ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ మాటకు మాట సమాధానం ఇచ్చినంత పనిచేశారు. తన వాదనకు కొనసాగింపుగా తమ ప్రభుత్వ దృష్టిలో "నిబద్ధ న్యాయమూర్తులు" అంటే ఈ జాతికి నిబద్ధులైన న్యాయమూర్తులన్న భావనే తప్ప కార్యనిర్వాహక వర్గానికి నిబద్ధులై ఉండడం కాదని రిజిజు టీకా టిప్పణి కూడా ఇచ్చారు. న్యాయవ్యవస్థను స్వాధీనం చేసుకునే ప్రశ్నేలేదని భరోసా కూడా వడేశారు. న్యాయవ్యవస్థను పటిష్ఠం చేయడానికి తాము పాటుపడ్తూ ఉంటే కొన్ని రాజకీయ పార్టీలు మాత్రం న్యాయవ్యవస్థ స్వతంత్రతతో రాజీ పడ్తున్నారని నిరాధార ఆరోపణలు చేస్తున్నాయని రిజిజు ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవ్యవస్థకు, ప్రభుత్వానికి మధ్య ఘర్షణ ఏదో జరుగుతున్నట్టు చిత్రిస్తున్నారనీ, కొన్ని రాజకీయ పార్టీలు ఇలాంటి ప్రచారం చేస్తున్నాయని, టీవీ చానళ్లు తమ ప్రసారాలకు మసాలా జోడించడంకోసం ఇలాంటి ఆరోపణలకు ప్రాధాన్యం ఇస్తున్నాయని వాపోయారు. కానీ రాజ్యాంగం చాలా పవిత్రమైందని ప్రధానమంత్రి మోదీ పదేపదే చెప్తున్నారని రిజిజు గుర్తు చేశారు. ఇంతకు ముందు నిబద్ధ న్యాయమూర్తులు ఉండాలన్న ప్రస్తావన వచ్చిందనీ, ఆ దృష్టితోనే కొందరు న్యాయమూర్తుల సీనియారిటీని ఖాతర్ చేయలేదని రిజిజు ఏకరువు పెట్టడం ఇందిరాగాంధీ హయాంనాటి పరిణామాలను గుర్తు చేయడమే. ఇందిరాగాంధీ అనుసరించిన ఈ విధానాన్ని అప్పుడు ప్రజాస్వామ్య వాదులు మెచ్చలేదు. ఆ సమయంలో బోలెడు విమర్శలు వచ్చాయి. కొలీజియం విధానం గురించి రిజిజు ఆరోపణలు గుప్పించినప్పుడు న్యాయమూర్తులు ప్రజలకు నిబద్ధులై ఉండాలనీ అనరు. ఆయన దృష్టిలో ప్రజలు అంటే సంపూర్ణ మెజారిటీ ఉంది కనక ఇష్టారాజ్యం చెలాయిస్తున్న మోదీ ప్రభుత్వం అయితే అసలు ఆంతర్యం ఏమిటో తెలిసిపోతూనే ఉంది. న్యాయమూర్తులను ప్రజలు ఎన్నుకోరని అంటూనే వారుకూడా ప్రజలకు జవాబుదార్లుగా ఉండాలని ఆయన అనడంలో అంతరార్థం బోధపడకుండా ఉండదుగదా! కార్యనిర్వాహకవర్గం హద్దులుదాటి ప్రవర్తించదు కానీ, న్యాయమూర్తులు కూడా ఇదే పద్ధతి అనుసరిస్తే మీడియా మసాలాచేర్చి వివాదం సృష్టించే అవకాశం ఉండదని మనసులోమాట చెప్పేశారు. న్యాయమూర్తులు హద్దుమీరితే మీడియాకు మేత దొరికినట్టేనని ఆయన చెప్పడంలోని ధర్మసూక్ష్మం ఇదే. మోదీ హయాంలో తాము ప్రమాదవశాత్తు కూడా ఇలాంటి పని చేయబోమన్నారు.

రిజిజు వ్యవహారం అలా ఉంచినా అత్యున్నత న్యాయస్థానం ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టే అవకాశం ఉన్న కేసులను విచారించకుండా పక్కన పడేయడం పరిపాటి అయిపోయింది. మోదీ ప్రధానమంత్రిగాఉన్న ఈ ఎనిమిదేళ్ల కాలంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తుల వ్యవహార సరళిని కిరణ్ రిజిజు ప్రస్తావిస్తున్నా ప్రజలు గ్రహించకుండా పోలేదు. న్యాయమూర్తుల నియామకానికి అనుసరిస్తున్న కొలీజియం విధానం లేశ మాత్రం కూడా లోపం లేనిది అని ఎవరూ అనడంలేదు. కొలీజియం వ్యవస్థ అమలులోకి రావడానికి నిర్దిష్టమైన కారణాలున్నాయి. న్యాయమూర్తుల నియామకానికి చట్టం చేసినా అది న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యాన్ని హరిస్తుంది... హుళక్కి చేస్తుందని భావించిన సుప్రీంకోర్టు దాన్ని కొట్టివేసింది. కొలీజియం వ్యవస్థ ద్వారా న్యాయమూర్తుల నియామకం జరగాలని రాజ్యాంగంలో ఎక్కడా ప్రస్తావనలేని మాట నిజమే. కానీ ఈ నియామకాల్లో ప్రభుత్వ జోక్యం మితిమీరినందువల్లే న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యాన్ని కాపాడే లక్ష్యంతో కొలీజియం వ్యవస్థ రూపుదిద్దుకుంది. కొలీజియం వ్యవస్థ దోషరహితమైందని సుప్రీంకోర్టు బల్లగుద్ది చెప్పడంలేదు. ఇప్పుడు అమలులో ఉన్న విధానం అదే కనక దాన్ని అనుసరించి తీరాలని మాత్రమే సుప్రీంకోర్టు భావిస్తోంది. న్యాయమూర్తుల నియామకానికి గతంలో తీసుకొచ్చిన చట్టం లాంటిది ఈ ప్రభుత్వం మళ్లీ తీసుకొచ్చే ప్రయత్నం ప్రభుత్వం చేస్తే న్యాయవ్యవస్థ చేయగలిగింది ఏమీలేదు. శాసనాలుచేసే హక్కు బాధ్యత చట్ట సభలకే ఉంటుంది. చట్టసభలు ఈ విషయంలో తమ బాధ్యత సరిగ్గా నిర్వర్తించని సందర్భాలు ఎదురవుతున్నాయి కనకే న్యాయవ్యవస్థ ప్రజలపక్షాన నిలబడి కలగజేసుకోవలసిన అవసరంవస్తోంది. మన న్యాయవ్యవస్థలో ప్రధానమైన సమస్య కొలీజియం విధానంలోఉన్న లోపాలు మాత్రమే కాదు. బెయిలు హక్కు, తప్పకపోతేనే జైలు అని సుప్రీంకోర్టు ఒకటికి నాలుగుసార్లు చెప్పినా ఈ సూత్రం అన్నివేళలా వర్తించడం లేదు. ముఖ్యంగా కింది కోర్టులు బెయిలు మంజూరు చేయడానికి వెనుకాడుతున్నాయి.

ఉదాహరణకు చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధకచట్టం (యు.ఎ.పి.ఎ.) బెయిలు మంజూరు చేయడానికి వీలే లేదు అన్న వితండ వాదాన్ని నిలవరించే ప్రయత్నమే కనబడడం లేదు. మావోయిస్టు అన్న ఆరోపణలకు గురైన ప్రొఫెసర్ సాయిబాబాకు బెయిలు మంజూరు అయినా ఆఘమేఘాల మీద ఆ బెయిలును రద్దుచేసింది సుప్రీంకోర్టే. అదే సుప్రీంకోర్టు ఎడాపెడా దేశద్రోహ ఆరోపణలు మోపడాన్ని నిలవరించింది. అంటే న్యాయవ్యవస్థలో స్పష్టమైన ద్వైదీభావం కనిపిస్తోంది. కింది కోర్టు జడ్జీల నడవడిక ఒక సమస్య అయితే సాక్షాత్తు సుప్రీంకోర్టు విభిన్న సందర్భాలలో భిన్నవైఖరి అనుసరిస్తూ ఉండడం అంతకన్నా పెద్ద సమస్య. అనేక ప్రధానమైన వ్యవహారాలలో కేసులు విచారణకే రాకపోవడం కేవలం న్యాయం నత్త నడకవల్లే కాదు. ఆ నత్త నడకకు జడ్జీల పదవులు హైకోర్టుల్లోనూ, సుప్రీంకోర్టులోనూ ఖాళీగా పడిఉండడమే. కొలీజియం సిఫార్సుచేసినా ప్రభుత్వం ఆ సిఫార్సులను ఆమోదించకపోవడమే కాక ఉలకక, పలకక ఉండిపోవడం పూర్తిగా ప్రభుత్వ పరిధిలోని అంశమే. అయినా కేంద్ర న్యాయశాఖమంత్రి కిరణ్ రిజిజు ఈ విషయాన్ని వాటంగా దాటవేస్తున్నారు. ఆయన కేసులు పేరుకు పోవడాన్ని ప్రస్తావించారే తప్ప కొలిజియం చేసిన సిఫార్సులను పక్కనపడేయడం, ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడానికి నిర్దిష్ట గడువు ఉండాలన్న అంశాన్ని మాత్రం ప్రస్తావించడం లేదు.

కేసులు పేరుకుపోవడంలో న్యాయమూర్తుల స్థానాలు ఖాళీగా ఉండడం సమస్యే కానీ సుప్రీంకోర్టు కూడా కీలమైన కేసులను విచారణకే స్వీకరించడం లేదు. వరసగా నలుగురు ప్రధాన న్యాయమూర్తుల హయాంలో జరిగింది ఇదే. పౌరసత్వ సవరణ చట్టం, 370వ అధికరణాన్ని రద్దుచేయడాన్ని సవాలుచేస్తూ దాఖలైన పిటీషన్లు, ఎన్నికల బాండ్లు, కడకు అనేక హెబియస్ కార్పస్ పిటిషన్లు విచారణకు చేపట్టకపోవడంలో మతలబు ఏమిటో తెలియక కాదు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎక్కడ తీర్పు చెప్పాల్సి వస్తుందోనన్న భయం అత్యున్నత న్యాయస్థానాన్ని కూడా పీడిస్తున్నట్టుంది.

ఎం కోటేశ్వరరావు

గుజరాత్ వైఫల్యాలివిగో మోదీజీ

సత్య హరిశ్చంద్రుడికి అసలు సిసలు వారసులం, శీలవంతులం అని చెప్పుకుంటున్న వారు కూడా అదే విధంగా ఉన్నారా ? 2022 డిసెంబరు 20న రాష్ట్రాలు, జిల్లాల సామాజిక ప్రగతి సూచికలను విడుదల చేశారు. మౌలిక మానవ అవసరాల ప్రాతిపదికన పోటీతత్వం, సామాజిక ప్రగతి అవసరం గురించి అధ్యయనంచేసిన ఒక సంస్థ ప్రధానమంత్రి ఆర్థికసలహా మండలికి సూచికలను అందచేసింది. దాన్ని మండలి అధ్యక్షుడు డాక్టర్ వివేక్ దేవరాయి అధికారికంగా విడుదల చేశారు. ఉచితాలపై దాడిచేసిన మోదీ వాటినే చూపి 2024 లోక్‌సభ ఎన్నికలకు బీజేపీ సిద్ధం అవుతోంది. దానిలో భాగంగానే మరో ఏడాదిపాటు ఉచితంగా ఆహార ధాన్యాలు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

ఈ పథకం గురించి గతంలో బీజేపీ ఏమి చెప్పింది, ఇప్పుడు ఎలా ప్రచారం చేసుకుంటోంది? 2013లో నాటి మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం జాతీయ ఆహార భద్రతా చట్టాన్ని తెచ్చేందుకు ఆర్డినెన్స్ జారీ చేసింది. పార్లమెంటు సమావేశాలకు ముందు అదెందుకు అని నాడు ప్రతిపక్ష బీజేపీ ప్రశ్నించింది. దాని మీద పార్లమెంటు చర్చలో బీజేపీనేత మురళీ మనోహర్ జోషి ఆ బిల్లు ఆహారం కాదు, కాంగ్రెస్ ఓట్ల భద్రత కోసం తెచ్చిందని సెలవిచ్చారు. ఇక బీజేపీ మాజీ కేంద్రమంత్రి శాంతకుమార్ పార్టీ అంతరంగాన్ని వెల్లడిస్తూ బహిరంగంగా చెప్పిన అంశాల మీద 2015 జనవరి 23న ఇచ్చిన వార్తకు టైమ్స్‌ఆఫ్ ఇండియా పత్రిక పెట్టిన శీర్షిక "జాతీయ ఆహార భద్రతా చట్టాన్ని బీజేపీ వ్యతిరేకించిందని చెప్పిన మాజీ ఆహారశాఖ మంత్రి శాంతకుమార్", కావాలంటే గూగుల్‌ను అడిగితే మనకి సమాచారాన్ని కూడా చూపిస్తుంది. అదే బీజేపీ నేతలు ఆహార భద్రత చట్టం కింద ఇస్తున్న వాటిగురించి ఇప్పుడు ఎంతగా ప్రచారం చేసుకుంటున్నదీ తెలిసిందే. కరోనా సాయంపేరుతో 2020 నుంచి 2022 డిసెంబరు వరకు ఉచితంగా ఆహార ధాన్యాలు ఇచ్చే పథకం ముగిసింది. దాన్ని 2023 ఆఖరు వరకు పొడిగించాలని తాజాగా కేంద్రమంత్రి వర్గం నిర్ణయించింది. ఇది 2024 ప్రారంభంలో జరిగే లోక్‌సభ ఎన్నికల కోసమని ఎవరైనా చెప్పగలరు.

ఆహార భద్రతా చట్టాన్ని ప్రారంభం నుంచీ బీజేపీ వ్యతిరేకించినప్పటికీ ఎన్నికల ముందు జనంలో చెడుగా చూపే అవకాశం ఉన్నందున సమర్థించినట్లు చెప్పారు. ఇక నరేంద్రమోదీ గుజరాత్ సిఎంగా కేంద్రానికి ప్రతిపాదిత ఆ బిల్లు మీద ఒక లేఖ రాశారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు ఇచ్చే ఆహారధాన్యాలను నెలకు 35 నుంచి 25 కిలోలకు తగ్గించటం ఏమిటని మండిపడుతూ భద్రత సంగతి సరే ఆ మొత్తంతో అవసరమైన కాలరీల శక్తిని ఎలా సమకూర్చుకోగలరని ప్రశ్నిస్తూ ఆ బిల్లు ఒక మనిషికి రెండు పూటలా తిండికి హామీ ఇవ్వటం లేదన్నారు. నిజంగా ఎంత చక్కగా చెప్పారు. చిత్రం ఏమంటే ఆ తరువాత మూడోసారి లోక్‌సభ ఎన్నికలకు పోతున్నప్పటికీ సరఫరాను ఒక్క కిలో కూడా పెంచలేదు. బీజేపీ నేత మురళీమనోహర్ జోషి బిల్లుకు ప్రతిపాదించిన సవరణల్లో ఆహార ధాన్యాలతో పాటు పప్పులు, నూనె కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రపంచ ఆకలి సూచికలో మన దేశ స్థానం పడిపోతున్నది తప్ప మెరుగుపడటం లేదు. 2022లో అంతకు ముందున్న 101 నుంచి 107కు దిగజారింది. మదింపు సరిగా జరగటం లేదని ప్రతిసారీ బీజేపీ, కేంద్ర ప్రభుత్వం కూడా చెబుతున్నది. దాని సంగతి పక్కన పెడితే ప్రపంచ సంస్థలు మన సూచికను పెంచే వరకు లేదా అసలు అన్నార్తులు లేరు అని కేంద్ర ప్రభుత్వం ప్రకటించే వరకు ఉచితంగా ఆహార ధాన్యాలను ఇవ్వాల్సి ఉంటుంది. అంత మాత్రాన బీజేపీ రాజకీయాన్ని జనం దృష్టికి తేకుండా ఉండాల్సిన అవసరం లేదు. తాజాగా కేంద్ర ఆహార మంత్రి పియుూష్ గోయల్ ప్రధాని చారిత్రాత్మక నిర్ణయం తీసుకొని ఏడాది పాటు 81.35 కోట్ల మందికి ఉచితంగా ఆహార పంపిణీ జరపనున్నట్లు జేజేలు పలికారు. ఈ పథకాన్ని దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారికి అమలు జరపాలి. 2014 నుంచి మూడేండ్లవరకు అమలు జరపాలని 2013లో నిర్ణయించారు. తరువాత అవసరాన్నిబట్టి అమలు చేస్తున్నారు. కానీ ఇంతవరకు దారిద్ర్యరేఖ ప్రాతిపదికను కేంద్ర ప్రభుత్వం తేల్చలేకపోతోంది. కొన్ని అంచనాల ప్రకారం 22శాతం మంది అంటున్నారు. ఎనభై ఒక్క కోట్ల మందికి ఉచితంగా ఆహార ధాన్యాలంటే ఈ లెక్కన దేశంలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారు 58 శాతంగా చెప్పాలి. మోదీ తొమ్మిది సంవత్సరాల్లో సాధించిన ప్రగతిగా దీన్ని చెప్పు కుంటారా ? లేక పాలకపార్టీకి ఓట్లకోసం ప్రజల సొమ్ముతో అర్హతలేని వారికి కూడా ఇస్తున్నారా? సమాధానం చెప్పేవారెవరు? పరిస్థితి ఇలాఉంటే పేదలకు అనుచితంగా ఉచితాలను ఇస్తున్నారని, గుజరాత్‌లో అలాంటి పథకాలు, ప్రలోభాలను తిరస్కరించారని ప్రధాని మోదీ చెప్పారు. ఇది నిజమేనా ?

ప్రపంచ ఆహార, వ్యవసాయ సంస్థ(ఎఫ్ఏఓ) 2020లో వేసిన అంచనా ప్రకారం, మన దేశంలో తీవ్ర ఆహార కొరతతో 22 కోట్ల మంది, ఒక మోస్తరు నుంచి తీవ్రంగా ఉన్న వారు 62 కోట్ల మంది ఉన్నట్లు పేర్కొంది. ప్రపంచానికి ఆహార ఎగుమతులు చేస్తున్న మన దేశంలో ఆకలి ఏమిటని కొందరు అడుగుతారు. లేదని నమ్మించ చూస్తారు. ఆఫ్రికాలో వజ్రాలు, బంగారు గనులున్నా అక్కడ ఎంతమంది చేతిలో అవి ఉన్నాయి? అలాగే మన ప్రజల్లో రెండు పూటలా తిండి తినేందుకు అవసరమైన వాటిని కొనుగోలు చేసే శక్తి ఎందరికి ఉంది? నిజానికి అలాంటి శక్తే ఉంటే పిల్లలు, మహిళల్లో రక్తహీనత ఎందుకు ఉన్నట్లు ? ఆరునెలల నుంచి ఐదు సంవత్సరాల మధ్య వయసులో ఉన్న పిల్లల్లో రక్తహీనత ఉన్నవారు 2015-16తో పోలిస్తే 2019-21 కాలంలో 58.6 నుంచి 67.1శాతానికి పెరిగినట్లు 2022 ఆగస్టు 5న కేంద్ర ఆరోగ్య మంత్రి మాండవీయ పార్లమెంటులో ప్రకటించారు. ఇది మన ప్రభుత్వసర్వే ప్రకారమే తేలింది. దీనికి కారణం ఏమిటి ? మెజారిటీ రాష్ట్రాల్లో రెండింజన్ల సర్కార్లే ఉన్నాయి. గుజరాత్‌లో పరిస్థితి మరీ దారుణం.

జాతీయ సగటు కంటే ఎక్కువగా గడచిన ఐదు సంవత్సరాల్లో పిల్లల్లో రక్తహీనత 62.6శాతం నుంచి 79.7శాతానికి పెరిగింది. తీవ్ర పరిస్థితిలో ఉన్నవారు 1.7 నుంచి 3.1శాతానికి పెరిగారు. పిల్లలే కాదు, స్త్రీ, పురుషులందరిలో రక్తహీనత పెరిగింది. ప్రతివారం పండ్లు తీసుకొనే వారు దేశంలో సగటున 56.1శాతం ఉంటే, అభివృద్ధి చెందిన గుజరాత్‌లో 39.8 శాతమే(2022 మే 23 టైమ్స్ ఆఫ్ ఇండియా) దీనికి ఏమంటారు? జాతీయ వినియోగ ఖర్చు గురించి 2017-18 సర్వే వివరాలను మోదీ ప్రభుత్వం తొక్కి పెట్టింది. తరువాత అసలు సర్వే ఊసే లేదు. సమగ్ర జాతీయ పోషకాహార సర్వే(సిఎన్ఎన్ఎస్) 2016-18 ఆధారంగా, 2022 ఏప్రిల్‌లో రక్తహీనత ముక్తభారత్ సంస్థ విడుదల చేసిన వాస్తవాల ప్రకారం, దేశంలో ఉన్న పరిస్థితితో కేరళను పోల్చితే పరిస్థితి ఇలా ఉంది. రెండింజన్ల బీజేపీ పాలిత రాష్ట్రాలు, సంక్షేమ పథకాల అమలు గురించి గొప్పలు చెప్పుకుంటున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణా వంటి రాష్ట్రాల్లోనూ పరిస్థితి దారుణంగా ఉంది. ఐదవ జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే 2019-21 ప్రకారం చూసినా కేరళలో పరిస్థితి మెరుగ్గా ఉంది. నాలుగవ సర్వేతో పోలిస్తే ఐదవ సర్వేలో దేశం మొత్తంలో రక్తహీనత సమస్య పెరిగింది.

కలగా మిగిలిన రైతుల ఆదాయం రెట్టింపు

దేశ ఆర్థిక వ్యవస్థకు అనాదిగా వ్యవసాయమే వెన్నెముక. సుమారు 50శాతం జనాభాకు జీవనాధారమైన సేద్యరంగం దేశానికి ఆహార భద్రతతోపాటు, ఎగుమతులు ద్వారా విదేశీమారక ద్రవ్యానికి అవకాశం కల్పిస్తోంది. వ్యవసాయాన్ని అంటిపెట్టుకొని విస్తరించిన వివిధ అనుబంధ కార్యకలాపాలపై ఆధారపడిన గ్రామీణ భారతంలో కొన్ని లక్షల కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి. 1950లో స్థూల జాతీయఉత్పత్తిలో 50 శాతంపైగా ఉన్న వ్యవసాయరంగం వాటా నేడు 15 శాతానికి దిగజారింది. దేశ జీడీపీలో సేద్యరంగం వాటాతగ్గడం అన్నదాతల ఆదాయాలపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. ఒకవైపు ప్రకృతి ప్రకోపాలు, మార్కెట్‌మోసాలు, ప్రభుత్వ విధానాలు అన్నదాతల బతుకులు ఛిద్రం చేశాయి. ఫలితంగా ఆత్మహత్యలు పెరిగాయి. దేశంలో ఉత్పత్తిచేసే వస్తువుకు నిర్ణయించే అధికారం, అవకాశంలేని వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే, అది అన్నదాతే. విచిత్రమేమిటంటే, పంట అధికంగా పండినా రైతుకు నష్టమే. తక్కువ పండినా లేదా పూర్తిగా పండకపోయినా నష్టమే. ఈ నేపథ్యంలో అన్నదాతల అవస్థలను అర్థం చేసుకొని "2022 నాటికి దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్ళు పూర్తవుతుందని, ఆనాటికి అన్నదాతల ఆదాయాన్ని రెట్టింపుచేస్తానని ప్రధాని మోదీ 26, ఫిబ్రవరి 2016 న ప్రకటించారు. 2022 పూర్తి కావస్తున్నా, ఆయన హామీ నేటికీ నెరవేరలేదు. పార్లమెంటరీ స్థాయిసంఘం నివేదిక కూడా ఇదే నిర్ధారించింది. సేద్యంపై ఆధారపడే వారి శాతం తగ్గుముఖం పట్టడానికి ఆదాయాలు క్షీణించడమే కారణం. రైతుల ఆదాయం రెట్టింపు ప్రాతిపదికన, 2015-16 సగటు నెలసరి ఆదాయం రూ.8,059. ద్రవ్యోల్బణాన్ని కూడా పరిగణలోనికి తీసుకుంటే ఇది 2022 నాటి లక్ష్యం రూ.21,146 కు పెరగాలి. ద్రవ్య ఆదాయమైతే రూ.16,118 లకు పెరగాలి. ఒకపక్క ద్రవ్యోల్బణం పరిమితంగా ఉన్నా, ద్రవ్య ఆదాయం రెట్టింపు అయినా రైతుకు ఒరిగేది ఏమీ ఉండదు.

పెరిగిన ఆదాయం తీరు:

ఎన్ ఎస్ ఎస్ వారి 70 వ రౌండ్ ప్రకారం, 2012-13లో వ్యవసాయ కుటుంబ నెలసరి సగటు ఆదాయం రూ.6,426 కాగా, అందులో సేద్యం వాటా రూ.3,081లు, కూలిపని ద్వారా వచ్చేది రూ.2,071, లైవ్‌స్టాక్ వాటా రూ.763లు, ఇతరత్రాలు రూ.512లు. 2018-19 చివరి నాటికి నెలసరి సగటు ఆదాయం రూ.10,218కి పెరిగితే, దీనిలో పై నాల్గింటి వాటాలు వరుసగా రూ.3,798, రూ.4,063, రూ.1,582, రూ.763లు. దీనినిబట్టి రైతులు సేద్యం కన్నా కూలిద్వారా ఎక్కువ సంపాదిస్తున్నారని అర్థమౌతోంది. వ్యవసాయ ఖర్చుల కనుగుణంగా సేద్యం ఆదాయం రెట్టింపు అవటంలేదని రైతులు వాపోతున్నారు. 2012-13లో కూలివాటా సగటు నెలసరి ఆదాయంలో 32శాతంకాగా, 2018-19నాటికి అది 40శాతానికి పెరిగింది. దీనిని బట్టి చాలామంది సేద్యం వదిలి కూలిపనికి పోతున్నారని తెలుస్తోంది.

కేటాయింపులు, ఉత్పత్తులు, పథకాలు :

2013-14 బడ్జెట్లో వ్యవసాయరంగానికి రూ.24,933.50 కోట్లు కేటాయించగా,

2021-22లో ఇది రూ.1,23,017.57 కోట్లు. అంటే సుమారు ఆరురెట్లు ఎక్కువ. ఇదేకాలంలో ఆహారధాన్యాల ఉత్పత్తి అనూహ్యంగా 265.05 మిలియను టన్నుల నుండి 2020-21లో రికార్డుస్థాయిలో 305.43శాతం, 2021-22లో 315.72 శాతానికి పెరిగాయి. ఉద్యానవన ఉత్పత్తులు 2014-15లో 280.99శాతం నుంచి 2020-21లో 320.48 శాతానికి రికార్డు స్థాయిలో పెరిగాయి. కొన్ని సందర్భాలలో పెరిగిన ఉత్పత్తి రైతుల ఆదాయాలను పెంచడానికి తోడ్పడితే, చాలా సందర్భాలలో ఆదాయాలు పెరగడానికి తోడ్పడలేదని నీతిఅయోగ్ నివేదిక తెలిపింది. కేంద్రం ఖరీఫ్, రబీ ఇతర వాణిజ్యపంటలకు ఖర్చులుపోను, కనీసం 50 శాతం లాభించేట్లుగా మద్దతు ధరలను ఏటా ప్రకటిస్తోంది. 2015-16 లో ఉన్న ధాన్యంపై కనీస మద్దతు ధర రూ.1,410 నుంచి 2021-22లో రూ.1,940కి పెంచితే, గోధుమపై రూ.1,525ల నుంచి రూ.2,015 లకు పెంచారు. అంటే ధాన్యంపై 38 శాతం, గోధుమలపై 32 శాతం పెంచారన్నమాట. ఇటీవల ఢిల్లీ సరిహద్దుల్లో వ్యవసాయ చట్టాలపై సమ్మెచేసిన రైతులు ఎంఎస్‌పీకి చట్టరూపం తేవాలని డిమాండు చేశారు. చెరుకు తప్ప, మిగిలిన ఉత్పత్తులకు ఎంఎస్‌పీకి అమ్మే రైతు కుటుంబాలు వాటా సున్నా నుంచి 24.7 శాతం మధ్యలోనే ఉన్నాయని ఎన్ఎస్ఎస్-77 రౌండ్ పేర్కొంది. వీరిలో ఎంఎస్‌పీని ఉపయోగించుకున్న అత్యధికులు ధాన్యం, గోధుమ రైతులే. దీనిని బట్టి చాలా తక్కువమంది మాత్రమే ఎంఎస్‌పీ వలన లబ్దిపొందుతున్నారని తెలుస్తోంది. 2019 లో కేంద్రం ప్రారంభించిన ప్రధాని కిసాన్ పథకం ద్వారా 11.7 కోట్లు రైతు కుటుంబాలకు రూ.6,000 లు చొప్పున, రూ.1.8 లక్షల కోట్లను ఏటా మూడు సమాన వాయిదాల ద్వారా చెల్లిస్తోంది. చిన్న, సన్నకారు రైతులు తమ పిల్లలకు విద్య, వైద్యం వంటి కనీస అవసరాలను తీర్చడంలో ఇబ్బందులు పడుతున్నారు. అలాగే సుమారు 29.29 కోట్లమంది రైతులు కేంద్రం 2016 లో ప్రారంభించిన ఫసల్ బీమా యోజనలో సభ్యులుగా చేరగా, సుమారు తొమ్మిది కోట్ల మందికి రూ.1,03,903 కోట్ల పంట నష్టపరిహారం అందింది. దీనిలో రైతులు చెల్లించింది కేవలం రూ.21,488 కోట్లు మాత్రమే. అంటే ప్రతి రూ.100 ల రైతు ప్రీమియంకు లభించినది రూ.484లు. కొన్ని రాష్ట్రాలు ఈ పథకంలో చేరడానికి ముందుకు రావటంలేదు. సంస్థాగత రుణాల కింద వ్యవసాయ రంగానికి 2013-14 లో రూ.7.3 లక్షల కోట్ల నుండి 2021-22 నాటికి రూ.16.5 లక్షల కోట్ల లక్ష్యంగా కేంద్రం ప్రణాళికలు రూపొందించింది. వ్యవసాయ యాంత్రీకరణ కోసం 2014-15 నుండి 31, డిశెంబరు 2021 వరకు రూ.5,130.61 కోట్లు కేటాయించారు. రూ.13.78 లక్షల యంత్రాలు, పనిముట్లు రాయితీ కింద అందించారు. దీనివల్ల కూలీల ఆదాయానికి గండిపడింది. వ్యవసాయ మౌలికవసతుల నిధి కింద 7,300 పైగా ప్రాజెక్టులకు రూ.7,700 కోట్లు వసూలు చేసారు.

ఎగుమతుల పాత్ర:

ఎగుమతులకు దోహదపడే "అగ్రి ప్రాసెసింగ్ సమూహాలు" ఏర్పాటు భారత రైతులకు ఒక మంచి అవకాశం కల్పిస్తాయి. ప్రపంచ మార్కెట్‌లో భారత వ్యవసాయ ఎగుమతుల వాటా కేవలం 2.2 శాతం మాత్రమే. ఇది 2030 నాటికి 10 శాతానికి పెరగవలసిన అవసరముంది. ప్రపంచంలో భారత్ రెండో అతిపెద్ద పండ్లు, కూరగాయలు పండించే దేశమైనప్పటికీ ప్రపంచ మార్కెట్లను భారత్ అందిపుచ్చుకోవడంలో విఫలమయింది. పండ్లు, కూరగాయలు, శుద్ధిచేసిన తృణధాన్యాలు, పాలు, పాల ఉత్పత్తులు, పౌల్ట్రీ, చేపలు వంటివి ఎగుమతుల ద్వారా రైతుల ఆదాయం మరింత పెరుగుతుంది. అగ్రి ప్రాసెసింగ్ సమూహాలను మహారాష్ట్ర, గుజరాత్, ఏపి, యుపి ప్రభుత్వాలు చాలా నెలకొల్పాయి. గుజరాత్ ఫ్యాక్టరీల్లో నెలకొల్పిన "ఫ్రెంచ్ ఫ్రై" భారత్‌ను అట్టి చిప్స్ దిగుమతి చేసుకున్న దేశస్థాయి నుంచి ప్రపంచ దేశాల్లో వాటిని ఎగుమతిచేసే దేశంగా మార్చివేసింది. అలాగే మామిడి గుజ్జు ముఖ్యంగా తోతపురి, దాషెరి రకాల నుండి గుజ్జు ఎగుమతులు కూడా పెరిగాయి. యుపీలోని లక్నో, ఏపీలోని అనంతపూరు అరటి పండ్ల సమూహాలు, మహారాష్ట్రలోని నాసిక్, పూనె, సంగ్లీ ద్రాక్ష సమూహాలు, అలాగే నాగపూర్‌లో కమలాలు రైతుల ఆదాయ వృద్ధికి ఎంతో తోడ్పడుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు శుద్ధిచేసిన వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై దృష్టి సారించాలి. పాల ఉత్పత్తుల ఎగుమతి జోన్‌లను, కేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి జోన్ల అభివృద్ధి ద్వారా ఎగుమతులను పెంచేందుకు రెండు ప్రభుత్వాలు పరిశీలించాలి. వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులకై వాటిని శుద్ధిచేయడానికి అవసరమయ్యే మౌలికవసతుల కల్పనకు, సంస్థాగత రుణ సహకారానికి, స్టాండరైజేషన్, ప్యాకింగ్, నిల్వచేసేందుకు సముద్ర, గగన పోర్టు స్థావరాలకు రవాణా సహకారానికి తగినంత ప్రోత్సాహకాలందించాలి.

డా.యస్.వై.విష్ణు, అసిస్టెంట్ ప్రొఫెసర్, 9963217252.

రంజన్ గొగోయ్ వింత ధోరణి

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదవీ విరమణచేసిన మూడు నెలలకే రాజ్యసభ సభ్యుడైన రంజన్ గొగోయ్ వ్యక్తిత్వం భిన్నమైంది. బీజేపీ ఆయనను రాజ్యసభకు పంపడమే వివాదాస్పదమైంది. రాజ్యసభలో న్యాయమూర్తి గొగోయ్ కనిపించడమే అపురూపం. అలాంటిది న్యాయవ్యవస్థకు సంబంధించిన అంశాలు రాజ్యసభలో ప్రస్తావిస్తాను అని ఆయన రెండోసారి చెప్పడం ఆశ్చర్యం కలిగిస్తోంది. 2020 మార్చిలో రాజ్యసభ సభ్యుడైనప్పుడూ ఆయన ఈ మాటే చెప్పారు. కానీ రాజ్యసభ కార్యకలాపాల్లో ఆయన పాల్గొన్న సందర్భాలే తక్కువ. చర్చల్లో పాల్గొన్న సందర్భాలు చాలా అరుదు. రాజ్యసభ సభ్యుడైన తరవాత ఆయన హాజరైంది 24 శాతం మాత్రమే.

ఆయనలాగే మూడేళ్ల కాలంలో రాజ్యసభ సభ్యుల హాజరు సగటున 79శాతం ఉంది.

ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు కనక ఆయన చర్చల్లో పాల్గొంటే ఆయనకున్న నైపుణ్యం సభకే గాక ఈ దేశానికీ ఉపయోగపడేదేమో. ఏడాదికన్నా ఎక్కువకాలం రైతుల ఆందోళనకు దారితీసిన వివాదాస్పదమైన వ్యవసాయ చట్టాలు రూపొందుతున్నప్పుడూ ఆయన నైపుణ్యం ఏమాత్రం ఉపయోగపడలేదు. వ్యవసాయం రాష్ట్రాల పరిధిలోని అంశం. అయినా

మోదీ ప్రభుత్వం సాహసించి వివాదాస్పద చట్టాలు తీసుకొచ్చింది. ఆ తరవాత ఉపసంహరించినప్పటికీ న్యాయమూర్తి గొగోయ్ కనక ఆ చర్చలో పాల్గొనిఉంటే ఉపయోగపడే అవకాశం ఉండేది. నామినేటెడ్ సభ్యులు సభాకార్యకలాపాల్లో పాల్గొనకపోతే వారిని నామినేట్ చేయడంవల్ల ఉండే ప్రయోజనమే దెబ్బతింటుంది. లతామంగేష్కర్, సచిన్ తెండూల్కర్ లాంటి వారు తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే రాజ్యసభకు హాజరయ్యేవారు. కనీసం వారి రంగాల గురించైనా మాట్లాడిన సందర్భమే లేదు.

రంజన్ గొగోయ్‌ని నామినేట్ చేయడమే వివాదానికి దారితీసింది కనక ఆయన సభకు హాజరు కావడానికి మొహమాట పడ్తున్నారేమో. బీజేపీపక్షాన నిలబడే పత్రికా రచయిత స్వపన్ దాస్ గుప్తా అయితే 90శాతం సమావేశాలకు హాజరయ్యారు. 50 సందర్భాలలో చర్చల్లో పాల్గొన్నారు. షబానా ఆజ్మీ, జావేద్ అఖ్తర్ లాంటి వారైతే పార్లమెంటు కార్యకలాపాల్లో చాలా చురుకుగా ఉండే వారు. పదవీ విరమణ తరవాత న్యాయమూర్తులకు రాజ్యసభ సభ్యత్వంలాంటివి ఇవ్వడం న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తినే దెబ్బ తీస్తుందని 2019లో గొగోయ్ చెప్పారు. మరి ఆయన విషయంలో ఈ సూత్రాన్ని ఎందుకు వర్తింప చేసుకోలేకపోయారో.

ఎనిమిది నెలలపాటు ఆయన కమ్యూనికేషన్లు, సమాచార సాంకేతిక స్థాయీ సంఘం సభ్యులుగా ఉన్నారు. ఒక్క సమావేశానికి కూడా హాజరుకాలేదు. విదేశీ వ్యవహారాల స్థాయిసంఘంలో ఉన్నప్పుడు ఆయనది ఇదే దారి. 2022లో ఆయన ఈ కమిటీకి మళ్లీ నియమితులయ్యారు. ఏడు సమావేశాలు జరిగితే ఒక్క దానికీ ఆయన హాజరు కాలేదు. ఆయన ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నప్పుడు తన మీదే లైంగిక వేధింపులకు పాల్పడ్డారన్న ఆరోపణవస్తే ఆ అంశాన్ని విచారించిన బెంచీకి ఆయనే నాయకత్వం వహించడం సహజ న్యాయ సూత్రానికి విఘాతం కలిగించడమే. ఆయనకు రహస్య వ్యవహారాల మీద ఆసక్తి ఎక్కువనిపిస్తుంది. ప్రతి విషయానికీ సీల్డ్‌కవర్లో సమాచారం ఇవ్వండి అనేవారు. పౌరుల రిజిస్టర్ చిట్టా(ఎన్ఆర్‌సీ), రాఫేల్ ఉదంతం, ఎన్నికల బాండ్ల కేసు సందర్భంలోనూ ఆయన సీల్డ్ కవర్ పద్ధతినే అనుసరించారు. ప్రజల ప్రాణాలకు సంబంధించిన హెబియస్ కార్పస్ పిటిషన్ల విషయంలో ఆయన వైఖరి గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది. అయోధ్య భూ వివాదం, శబరిమల వ్యవహారం, రాఫేల్ వివాదం మీద ఆయన పదవీ విరమణకు సిద్ధపడుతున్న తరుణంలో ఇచ్చిన తీర్పుల కారణంగానే మోదీ ప్రభుత్వం ఆయనను రాజ్యసభకు పంపించిందేమోనన్న అనుమానాలకు బలం చేకూర్చే రీతిలోనే ఆయన నడవడికా ఉంది.

మరీ విచిత్రం ఏమిటంటే 2018 జనవరి 12వ తేదీన అప్పటి సుప్రీంకోర్టు న్యాయమూర్తుల్లో రెండవ స్థానంలో ఉన్న జాస్తి చలమేశ్వర్‌తో కలిసి ఏర్పాటుచేసిన పత్రికా ప్రతినిధుల సమావేశంలో గొగోయ్ కూడా ఉన్నారు. ఆ విలేకరుల సమావేశంలో పాల్గొన్న మరో ఇద్దరు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు మదన్ బి.లోకూర్, కురియన్ జోసెఫ్. ఈ విలేకరల సమావేశం దీపక్‌మిశ్రా ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నప్పుడు నిర్వహించారు. సుప్రీంకోర్టు వ్యవహారం అంతా సవ్యంగా కనిపించడం లేదని, పరిస్థితి ఇలాగే కొనసాగితే ప్రజాస్వామ్యానికే ముప్పు ఏర్పడుతుందని విలేకరుల సమావేశంలో ఆరోపించారు. ఈ నలుగురిలో రంజన్ గొగోయ్ కూడా ఉన్నారు కనక ఆయన ప్రధాన న్యాయమూర్తి అయితే, సుప్రీంకోర్టు సవ్యంగా నడవడానికి మార్గం వేస్తారన్న ఆశ ఉండేది. ఆ ఆశ నెరవేరకపోగా బాహాటంగా విలేకరుల సమావేశంలో పాల్గొనడానికి సాహసించింది ఈయనేనా అనే అనుమానం వచ్చింది. ఆ అనుమానం ఆయన ప్రధాన న్యాయమూర్తిగా ఉండగా రుజువైంది.

పార్లమెంటు సమావేశాలకు అతి తక్కువగా హాజరు కావడాన్ని ఆయన గత ఏడాది డిసెంబర్‌లో సమర్థించుకున్నారు. తనకు ఇష్టమైనప్పుడే వెళ్తానని తెగేసి చెప్పారు. తాను స్వతంత్రుడిననీ అందువల్ల తనకు ఏ పార్టీ ఆదేశాలూ పని చేయవు అని కూడా అన్నారు. సభలో ఎప్పుడు ఉండాలో ఎప్పుడు వెళ్లిపోవాలో నిర్ణయించుకునే స్వేచ్ఛ తనకు ఉందని కూడా గొగోయ్ అన్నారు. తనను ఏ ట్రిబ్యునల్ చైర్మన్‌గానో నియమించి ఉంటే జీతభత్యాలు ఇంకా ఎక్కువ వచ్చేవన్న ఆయన వ్యాఖ్య మీద తృణమూల్ కాంగ్రెస్ సభ్యులు మౌసం నూర్, జౌహర్ సర్కార్ సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చారు. అయితే ఇది సభా హక్కుల కమిటీకి వెళ్లనే లేదు.

-అనన్య వర్మ

ఈ-మెయిల్

వృద్ధుల పెన్షన్ కనీసం ఐదువేలు చెయ్యాలి

రేపు ఒకటవ తేదీ నుండి ఇచ్చే వృద్ధాప్య పెన్షను రూ.2750 చేస్తానని ముఖ్యమంత్రి ప్రకటించాడు. అంటే గతంలో కంటే 250 ఎక్కువ ఇస్తున్నాడు. వాస్తవానికి ఎప్పుడో మూడువేలు చెయ్యాల్సింది. అయినా 2750 రూపాయలు ఇద్దరు ముసలివారికి ఏమూలాలకు సరిపోతాయి.? వీరికి చెత్తపన్ను మినహాయించారా !! ఇంటిపన్ను మినహాయించారా.! కరెంటు పన్ను మినహాయించారా! లేదుగదా! కూరగాయలు ఆకాశాన్ని అంటుతున్న ఈరోజుల్లో రూ. 2750 ఎలా సరిపోతాయి? పప్పుదినుసులు, నూనె ధరలు చెప్పనలవి కాదు! వీరికి జబ్బు చేస్తే మందులు కొనుక్కోవాలా! సర్కారు దవాఖానకు పొతే అక్కడ ఎమీ ఉండవు. బయట కొనుక్కోమంటారు. ఇలా అన్నిరేట్లు దడ పుట్టిస్తుంటే రూ.2750 ఇచ్చి సర్దుకుపోండి అంటే ఏవిధంగా? ముఖ్యమంత్రి తనకు సలహాలు ఇచ్చేందుకే 60 మందిని పెట్టుకుని నెలనెలా కోట్లరూపాయలు వారికి తగలేస్తున్నారు. మధ్యపాన నిషేధ కమిటి అనిపెట్టి, నిషేధములేదు పాడు లేదు. ఆ అధ్యక్షుడికి నెలజీతాలు, కారు, దానికి మెయింటెనెన్స్ , డ్రైవరు, వానికి జీతాలు, ప్రభుత్వ (ప్రజలకు వ్యతిరేకంగా వాదించే) లాయర్లకు కోట్లకోట్ల చెల్లింపులు ఇవన్నీ మానుకుంటే వృద్ధాప్య పెన్షను అవ్వ తాతలకు ఐదు వేలనుండి పదివేల దాకా ఇవ్వవచ్చు.

నార్నె వెంకటసుబ్బయ్య

దిల్లీలో కోవిడ్ ఉచిత టీకాల్లేవ్

వాక్సిన్ల కొరతతో మూతపడ్డ ప్రభుత్వ పంపిణీ కేంద్రాలు

న్యూదిల్లీ: కోవిడ్-19 వాక్సిన్ల కొరత దేశరాజధానివాసులను ఇబ్బంది పెడుతోంది. ఒక వైపు కొత్తరకం వైరస్ మెల్లమెల్లగా విస్తరిస్తున్న వేళ ఉచిత టీకాల పంపిణీకి అంతరాయం కలగడం స్థానికుల్లో ఆందోళనకు దారితీస్తోంది. కోవాగ్జిన్, కోవిషీల్డ్ టీకాలు అందుబాటులో లేక ప్రభుత్వ టీకా కేంద్రాలన్నీ దాదాపు మూతబడ్డాయి. కేంద్రప్రభుత్వం కొత్త టీకాలను పంపని కారణంగా కొరత నెలకొన్నట్లు అధికారులు తెలిపారు. మూడు జిల్లాల్లో టీకాల కొరత ఉన్నదని, అక్కడి వాక్సినేషన్ కేంద్రాలు మూతబడ్డాయని చెప్పారు. తమ జిల్లాల్లో ఏ వాక్సినేషన్ కేంద్రంలో టీకాలు లేవని, రెండు వాక్సిన్ల కొరత ఐదారు రోజులుగా ఉన్నదని ఓ అధికారి చెప్పారు. నెలారంభంలో నిత్యం ఏడు నుంచి పది కేంద్రాల్లో టీకా పంపిణీ జరిగిందన్నారు. టీకాల కొరత గురించి కేంద్రానికి దిల్లీ ప్రభుత్వం తెలియజేయగా ఇంకా స్పందన రాలేదన్నది అధికారిక సమాచారం.

'దిల్లీ ప్రభుత్వ వాక్సినేషన్ కేంద్రాలన్నింటిలో 40 డోసులు ఉదయం ఉండగా సాయంత్రానికి మూడు కోవాగ్జిన్ డోసులు మిగిలాయి. కోవిషీల్డ్ మందు అయిపోయింది' అని దిల్లీ ప్రభుత్వ అధికార వర్గాలు తెలిపాయి. బుధవారం మూడు వాక్సినేషన్ కేంద్రాలు పనిచేసినట్లు తెలుస్తోంది. వాక్సిన్‌ల గురించి ప్రజలు అడుగుతున్నారని, సరఫరా లేదని, కొత్త వాక్సిన్లు వచ్చాక పంపిణీ మొదలవుతుందని చెబుతున్నామని అధికారి అన్నారు.

కోవిడ్ టీకాల కొరత, మూడవ డోసు తీసుకోవడంపై ప్రజల్లో విముఖతపై సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆందోళన వ్యక్తంచేశారు. ఇంటింటికి వెళ్లి టీకాలు ఇవ్వాలని దిల్లీ ప్రభుత్వం తొలుత భావించిందిగానీ టీకాల కొరతతో ఇబ్బంది ఎదురైంది. నూటికి నూరుశాతం మంది మొదటి, రెండవ టీకాలు తీసుకోగా 24శాతం మంది మాత్రమే ప్రికాషన్ డోసు తీసుకున్నారు. వైద్యులు గడప గడపకు వెళ్లినాగానీ టీకా తీసుకునేందుకు ప్రజలు ఒప్పుకోని పరిస్థితులు ఉన్నట్లు

తాజాగా కోవిడ్‌పై నిర్వహించిన సమీక్షా సమావేశంలో కేజ్రీవాల్ అన్నారు.

కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలోని సఫ్దర్జంగ్ ఆసుపత్రి కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ జుగల్ కిశోర్ మాట్లాడుతూ, ఉచిత టీకాలు లేకపోతే పేదలపై ప్రభావం తీవ్రంగా ఉంటుంది. ప్రైవేటు కేంద్రాలకు వెళ్లి డబ్బులిచ్చి టీకాలు వేయించుకోవాలి, లేదంటే టీకాలు తీసుకోకుండా ఉండిపోవాలి. ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి నాసిక వాక్సిన్ కోసం రూ.800 చెల్లించే స్థితిలో ఎంత మంది ఉన్నారో తెలియదు' అని అన్నారు.

మోదీ తల్లికి అస్వస్థత

అహ్మదాబాద్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ తల్లి హీరాబెన్ అస్వస్థతకు గురయ్యారు. మంగళవారం రాత్రి కుటుంబసభ్యులు ఆమెను అహ్మదాబాద్‌లోని యూఎన్ మెహతా ఆసుపత్రికి తరలించారు. ఆమెకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఆసుపత్రి యాజమాన్యం ప్రకటన విడుదల చేసింది. తల్లి అనారోగ్యం గురించి తెలుసుకుని ప్రధాని మోదీ హుటాహుటిన అహ్మదాబాద్ బయల్దేరారు. మోదీ రాక నేపథ్యంలో నగరంలో అధికారులు భద్రతా ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే కొంతమంది బీజేపీ ఎమ్మెల్యేలు ఆసుపత్రికి చేరుకుని హీరాబెన్ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడారు. ఈ ఏడాది జూన్‌లో హీరాబెన్ శతవసంతంలోకి అడుగుపెట్టారు. ఇటీవల గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్‌కు ముందు మోదీ తన తల్లిని కలిసి ఆమెతో కొంత సమయం గడిపారు. ఆమె ఆశీర్వాదం తీసుకున్నారు.

కర్ణాటకలో చర్చి ధ్వంసం

మైసూర్: కర్ణాటకలోని ఓ చర్చిని కొందరు గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు. మైసూరులోని పెరియపట్నంలో ఉన్న సెయింట్ మేరీస్ చర్చిలో ఇటీవల క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అయితే మంగళవారం రాత్రి కొందరు గుర్తుతెలియని దుండుగులు ఈ చర్చిని, బాలయేసు విగ్రహాన్ని ధ్వంసం చేసినట్లు పోలీసులు తెలిపారు. చర్చి వెనుక తలుపులు పగుల గొట్టి లోపలికి ప్రవేశించారని చెప్పారు. నిందితులను గుర్తించేందుకు సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నామన్నారు. చర్చి వెలుపల ఉంచిన విరాళాల పెట్టెతో పాటు డబ్బు ఎత్తుకెళ్లారని చెప్పారు. దొంగతనం కేసుగా భావిస్తున్నామని మైసూర్ పోలీస్ సూపరింటెండెంట్ సీమా లత్కర్ అన్నారు. మత మార్పిడుల ఆరోపణలపై కొన్ని నెలలుగా చర్చిలు, క్రైస్తవ మిషనరీలపై దాడులు జరుగుతున్న సంగతి తెలిసిందే. గత శుక్రవారం ఉత్తరాఖండ్ ఉత్తరకాశీలో బలవంతంగా మతమార్పిడులు జరుగుతున్నాయని ఆరోపిస్తూ కొంతమంది కర్రలు, ఆయుధాలతో దాడి చేశారు.

పొగమంచుతో 100 విమానాలకు అంతరాయం

న్యూదిల్లీ: దట్టమైన పొగమంచు కారణంగా విమానాల రాకపోకలకు అంతరాయమేర్పడుతోంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తీవ్రమైన పొగ మంచు వల్ల దిల్లీలో 100 విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని దిల్లీ విమానాశ్రయ అధికారులు బుధవారం వెల్లడించారు. మరో నాలుగురోజుల్లో రాబోతున్న కొత్త సంవత్సరం సందర్భంగా దిల్లీ విమానాశ్రయంలో ప్రయాణికుల రద్దీ పెరిగింది. మూడురోజులుగా కురుస్తున్న మంచువల్ల వాతావరణ అననుకూల పరిస్థితుల నేపథ్యంలో విమానాల రాకపోకలకు ఆటంకమేర్పడుతుందని, కొన్ని విమానాలను దారి మళ్లించామని దిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ (డీఐఎల్) వెల్లడించింది. దిల్లీ విమానాశ్రయంలోని ఫ్లైట్ ఇన్ఫర్మేషన్ డిస్‌ప్లే సిస్టమ్ ప్రకారం (ఎఫ్ఐడీఎస్) బుధవారం మధ్యాహ్నానికి 18కి పైగా విమానాలు ఆలస్యమయ్యాయి.

జమ్ములో నలుగురు ఉగ్రవాదుల హతం

శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లో బుధవారం ఉదయం భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. జమ్ములోని సిద్రా ప్రాంతంలో భద్రతా బలగాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో నలుగురు ఉగ్రవాదులు మరణించినట్లు పోలీసులు తెలిపారు. కాల్పుల సమయంలో ట్రక్కులో మంటలు చెలరేగాయని, మంటలను ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించారని అన్నారు. ఓ ట్రక్కు కదలికలు అనుమానాస్పదంగా ఉండటంతో పోలీసులు దాన్ని వెంబడించారు. చెక్‌పోస్ట్ వద్ద ట్రక్కుని ఆపగా డ్రైవర్ పరారయ్యాడు. ట్రక్కును తనిఖీ చేస్తుండగా అందులో దాగి ఉన్న ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. భద్రతా దళాలు వెంటనే స్పందించాయని, కాల్పుల్లో నలుగురు ఉగ్రవాదులు మరణించారని జమ్ము అదనపు డైరెక్టర్ జనరల్ ముఖేష్ సింగ్ తెలిపారు. ఘటనాస్థలం నుండి 7 ఏకే-47 తుపాకులు, 3 పిస్టళ్లు సహా భారీగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఉగ్రవాదులు అక్రమంగా భారత్‌లోకి చొరబడినట్లు ఆయన చెప్పారు. దాదాపు 45 నిమిషాలకు పైగా ఎదురుకాల్పులు జరిగాయని, ఆ ప్రాంతమంతా భయానకంగా మారిందని అధికారులు వెల్లడించారు. ఉగ్రవాదులు చేతి గ్రనేడ్లు విసిరారని తెలిపారు. ఎన్‌కౌంటర్ జరిగిన సమయంలో భారీగా మంచు ఉందని వివరించారు.

ఇళ్లు ఖాళీ చేస్తారా...జీతంలో కోత విధించాలా?

ఎయిరిండియా ఉద్యోగులకు కేంద్రం హుకుం

న్యూదిల్లీ: దేశ రాజధాని దిల్లీలోని వసంత్ విహార్‌లో ఉన్న అధికారిక భవనాల్లో ఇంకా నివాసం ఉంటున్న ఎయిరిండియా ఉద్యోగుల వేతనాల్లో కోత విధించాలని యాజమాన్య సంస్థ టాటా సన్స్‌ను కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. అక్టోబరు నుంచి దీన్ని అమలు చేయాలని కోరినట్లు ఉద్యోగులు తెలిపారు. నెలకు దాదాపు రూ.95 వేల వరకు వసూలు చేయాలని ఆదేశించినట్లు వెల్లడించారు. ఇంత మొత్తం మినహాయించుకుంటే తమకు వచ్చేది ఏమీ ఉండదని ఉద్యోగులు వాపోయారు. ప్రస్తుతం ఎయిరిండియా ఉద్యోగులు నివాసం ఉంటున్న భవనాలు ప్రభుత్వ పెట్టుబడుల ఉపసంహరణ ప్రణాళికల్లో భాగం కాదు. దీంతో ఈ ఆస్తుల్ని ఇతర రియల్ ఎస్టేట్ ప్రాపర్టీలతో పాటు 'ఎయిరిండియా అసెట్ హెల్డింగ్స్ లిమిటెడ్'కు బదిలీ చేశారు. వీటిని రూ.60 వేల కోట్ల రుణ బకాయిలు చెల్లించడానికి ప్రభుత్వం విక్రయించాల్సి ఉంది. వాస్తవానికి ఎయిరిండియా టాటాల చేతుల్లోకి వెళ్లగానే ఉద్యోగులు వసంత్ విహార్‌లోని నివాసాల నుంచి ఖాళీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కానీ, అప్పటి నుంచి వారు పొడిగించాలని కోరుతూ వస్తున్నారు. తాజాగా న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వచ్చే ఏడాది పిల్లలకు బోర్డు పరీక్షలు ఉన్నందున ఖాళీ చేయడానికి మరికొంత సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఎయిరిండియాకు ముంబై, దిల్లీలో హౌసింగ్ కాలనీలు ఉన్నాయి. నివాసాలు ఖాళీ చేయాలని అధికారులు ఇప్పటికే అనేకసార్లు ఆదేశాలు జారీ చేశారు. లేదంటే రూ.10-15 లక్షల వరకు జరిమానా విధిస్తామని బెదిరించినట్లు ఉద్యోగులు ఆరోపించారు. అక్టోబరులో ఓసారి నీటి సరఫరా నిలిపివేసినట్లు పేర్కొన్నారు.

ఊమెన్‌చాందీకి సీబీఐ క్లీన్‌చిట్



తిరువనంతపురం: కేరళలో సంచలనం సృష్టించిన 'సోలార్ స్కామ్'లో ప్రధాన నిందితురాలైన మహిళపై లైంగిక వేధింపుల కేసు నుంచి మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఊమెన్ చాందీకి ఊరట లభించింది. ఈ కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ ఆయనకు క్లీన్‌చిట్ ఇచ్చింది. ఈ మేరకు సీబీఐ కోర్టు రిఫరల్ రిపోర్ట్ సమర్పించింది. 2012లో ఊమెన్ చాందీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 'సోలార్ కుంభకోణం' చోటుచేసుకుంది. సోలార్ యూనిట్ల ఏర్పాటు పేరుతో కోట్ల రూపాయల మేర అవకతవకలకు పాల్పడినట్లు యూడీఎఫ్ ప్రభుత్వంపై ఆరోపణలు వచ్చాయి. ఈ కుంభకోణంలో ప్రధాన నిందితురాలిగా ఉన్న ఓ మహిళ.. తాను లైంగిక వేధింపులకు గురైనట్లు 2013 జులైలో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఊమెన్ చాందీ సహా, కొందరు మంత్రులు, కేంద్ర మాజీ మంత్రులు తనతో అసభ్యంగా ప్రవర్తించారని ఆమె ఆరోపించింది. దీంతో దర్యాప్తు చేపట్టిన కేరళ క్రైం బ్రాంచ్ పోలీసులు.. చాందీ, మరో ఐదుగురిపై కేసు నమోదు చేశారు. 2021లో కేరళ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ కేసును ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం సీబీఐకి అప్పగించింది. అయితే ఇది రాజకీయంగా తీవ్ర దుమారానికి తెరలేపింది. ఈ నేపథ్యంలోనే దర్యాప్తు చేపట్టిన సీబీఐ.. తాజాగా రిఫరల్ రిపోర్ట్‌ను కోర్టుకు సమర్పించింది. ఈ కేసులో మాజీ సీఎం చాందీకి వ్యతిరేకంగా సదరు మహిళ చేసిన ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని సీబీఐ దర్యాప్తులో తేలినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. అంతేగాక, ఫిర్యాదులో చెప్పినట్లుగా ఆ మహిళ.. చాందీ నివాసానికి వెళ్లినట్లుగా ఎలాంటి సాక్ష్యాలు లభించలేదని పేర్కొన్నాయి. దీంతో ఆయనకు ఈ కేసులో సీబీఐ క్లీన్‌చిట్ ఇచ్చినట్లు తెలిసింది.

మనుస్మృతి దహనం...ముగ్గురి అరెస్టు

జైపూర్: మనుస్మృతిని తగులబెట్టారనే ఆరోపణలపై ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు రాజస్థాన్ పోలీసులు తెలిపారు. డిసెంబరు 25న బౌద్ధమత దీక్షలో పాల్గొన్న అనంతరం వారు ఈ గ్రంథాన్ని తగులబెట్టినట్లు హిందూ సంస్థలు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఈ గ్రంథాన్ని తగులబెట్టినవారు చేసిన నినాదాలు వీడియోలో వినిపిస్తున్నాయి. రాజస్థాన్‌లోని బామర్ అదనపు పోలీస్ సూపరింటెండెంట్ నర్పట్ సింగ్ మీడియాతో మాట్లాడుతూ డిసెంబరు 25న కొందరు బౌద్ధ మత దీక్షలో పాల్గొన్నారని చెప్పారు. ఆ తర్వాత మనుస్మృతిని తగులబెట్టారన్నారు. ఈ దీక్షా కార్యక్రమాన్ని భీమ్ సేన నిర్వహించినట్లు వెల్లడించారు. తమకు ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేశామన్నారు. భారత శిక్షా స్మృతి సెక్షన్లు 153ఏ (మతం, జాతి, జన్మస్థలం, నివాసం, భాష మొదలైనవాటి ఆధారంగా వేర్వేరు వర్గాల మధ్య శత్రుత్వాన్ని ప్రోత్సహించడం), 295 (ప్రార్థనా స్థలాన్ని కానీ, పవిత్ర వస్తువును కానీ అపవిత్రం లేదా నాశనం లేదా ధ్వంసం చేసిన ఎవరైనా), 295ఏ (మతాన్ని లేదా మత విశ్వాసాలను కించపరుస్తూ ఏదైనా మతస్థుల మనోభావాలు దెబ్బతీసే ఉద్దేశంతో చేసే పనులు), 298 (ఓ వ్యక్తికిగల మతపరమైన భావాలను గాయపరిచే ఉద్దేశంతో ఉద్దేశపూర్వకంగా ఏమైనా మాటలు ఉచ్చరించడం) ప్రకారం కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

లోకాయుక్త బిల్లుకు మహారాష్ట్ర ఆమోదం

నాగపూర్: మహారాష్ట్ర లోకాయుక్త -2022 బిల్లుని రాష్ట్ర అసెంబ్లీ బుధవారం ఆమోదించింది. ఈ బిల్లుని మంత్రి దీపక్ కేస్కర్ సోమవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. లోకాయుక్త బిల్లు ప్రకారం...ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా ఏదైనా న్యాయ విచారణ ప్రారంభించే ముందు, సభ సమావేశానికి ముందు తీర్మానం తీసుకురావడానికి ముందు అసెంబ్లీ ఆమోదం పొందవలసి ఉంటుంది. ఈ తీర్మానం అసెంబ్లీలోని మొత్తం సభ్యుల్లో మూడింట రెండొంతుల మంది ఆమోదం పొందాల్సి ఉంటుంది. ముఖ్యమంత్రిపై అవినీతి ఆరోపణలకు సంబంధించిన కేసులను లోకాయుక్త దర్యాప్తు చేయదని బిల్లు పేర్కొంది. ఒకవేళ విచారణ చేపట్టినా రహస్యంగా ఉంచాలని, లోకాయుక్త ఫిర్యాదును కొట్టివేయడానికి అర్హమైనదని నిర్ధారణకు వస్తే.. విచారణ రికార్డులు ప్రచురించకూడదు. అలాగే ఎవరికి అందుబాటులో ఉండకూడదు. లోకాయుక్తలో నలుగురు సభ్యులు ఉండగా వారిలో ఇద్దరు తప్పనిసరిగా న్యాయవ్యవస్థకు చెందిన వారై ఉండాలి. నిబంధనల ప్రకారం.. ప్రస్తుత లేదా మాజీ హైకోర్టు జడ్జి లోకాయుక్త చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు.

'ముంబై' జోలికొస్తే ఊరుకోం: ఫడ్నవీస్

నాగపూర్: 'ముంబై కేవలం మహారాష్ట్రకే చెందింది. రాజధాని జోలికొస్తే సహించే ప్రసక్తే లేదు' అని మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కర్ణాటక నాయకులను హెచ్చరించారు. మహారాష్ట్ర, కర్ణాటక మధ్య కొనసాగుతోన్న సరిహద్దు వివాదంపై రెండు రాష్ట్రాల నేతల నడుమ మాటల యుద్ధం కొనసాగుతోంది. వివాదాస్పద ప్రాంతాలపై రెండు రాష్ట్రాల అసెంబ్లీలు ఇప్పటికే తీర్మానాలు చేశాయి. ఈ క్రమంలో బెళగావిని కేంద్రపాలిత ప్రాంతం చేయాలంటూ మహారాష్ట్ర నేతలు పేర్కొంటే.. ఏకంగా ముంబైనే యూటీ చేయాలని కర్ణాటక మంత్రులు డిమాండ్ చేస్తున్నారు.

సరిహద్దు వివాదానికి సంబంధించి కర్ణాటక నేతలు చేస్తోన్న ఆరోపణల అంశాన్ని మహారాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నేత అజిత్ పవార్ ప్రస్తావించారు. కర్ణాటక సీఎంతో సహా నేతలందరూ మరాఠీల మనోభావాలను దెబ్బతీస్తుంటే.. మహారాష్ట్ర ప్రభుత్వం దీటుగా స్పందించడం లేదన్నారు.

జోడో యాత్రకు యూపీ బీజేపీయేతర నేతల నిరాసక్తత

లక్నో: రాహుల్ గాంధీ నేతృత్వంలోని భారత్ జోడో యాత్రలో చేరాలని కాంగ్రెస్ పార్టీ చేసిన ఆహ్వానానికి ప్రతిస్పందనగా, ఉత్తరప్రదేశ్ మాజీ డిప్యూటీ సీఎం డాక్టర్ దినేశ్ శర్మ, ఇతర ప్రతిపక్ష నాయకులు ఎవరూ ఆసక్తి చూపలేదు. ఈ యాత్ర జనవరి 3న ఘజియాబాద్ సరిహద్దు నుండి ఉత్తరప్రదేశ్‌లోకి ప్రవేశించే అవకాశం ఉంది. ఎల్‌యూ ప్రొఫెసర్ హోదాలో డాక్టర్ దినేశ్ శర్మ సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ సహా అనేకమంది బీజేపీయేతర పార్టీల నాయకులు హాజరు కావాలని కాంగ్రెస్ కోరింది. ఎస్‌పీ అధినేత అఖిలేశ్ షెడ్యూల్ ఇప్పటికే ఖరారైందని, అందువల్ల రాహుల్ యాత్రలో ఆయన పాల్గొనలేకపోవచ్చని ఎస్పీ అధికార ప్రతినిధి రాజేంద్ర చౌదరి చెప్పారు. జయంత్ చౌదరి కూడా యాత్రలో భాగస్వామి కాకపోవచ్చని ఆ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి అనిల్ దూబే చెప్పారు. మరోవైపు, బీఎస్పీ, ఎస్‌బీఎస్పీ ఇప్పటికీ అధికారిక ఆహ్వానం కోసం వేచి ఉన్నాయి. జనవరి 4న, యాత్ర బాగ్‌పట్‌లోని మావి కలాన్‌కు చేరుకుంటుంది. అదే జిల్లాలోని బాగ్‌పట్ నగరం, సిసానా, సరూర్‌పూర్, బరోట్ మీదుగా వెళుతుంది. జనవరి 5న ఇది షామ్లీ జిల్లా ఆలం చేరుకుని, కంధ్లా, ఉంచా గ్రామం, కైరానా మీదుగా వెళుతుంది.

ద్వేషంతో సమాజాన్ని విభజించారు

- పెరిగిన ధరలు... నిరుద్యోగంతో ప్రజలు విలవిల
- కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవంలో కేంద్రంపై ఖడ్గే ధ్వజం

న్యూదిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే బుధవారం కేంద్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. సమాజం 'ద్వేషంతో విభజించబడింది' అని, భారత ప్రాథమిక అంశాలు నిరంతరం దాడులకు గురవుతున్నాయని విమర్శించారు. ఏఐసీసీ ప్రధాన కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ 138వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ధరల పెరుగుదల, నిరుద్యోగంతో దేశ ప్రజలు అల్లాడిపోతున్నారు. కానీ ప్రభుత్వం మాత్రం ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తోందని తెలిపారు. అందరినీ కలుపుకుపోవడమనే కాంగ్రెస్ విధానం వల్ల భారతదేశం పురోగమించింది' అని అన్నారు. 'భారతదేశం ఒక విజయవంతమైన, బలమైన ప్రజాస్వామ్య దేశంగా ఆవిర్భవించడమే కాకుండా గత కొన్ని దశాబ్దాల్లో ఆర్థిక, అణు, వ్యూహాత్మక రంగాల్లో శక్తివంతమైన దేశంగా ఉంది' అని ఖడ్గే తెలిపారు. వ్యవసాయం, విద్య, వైద్యం, ఐటీ, సేవా రంగాల్లో ఇది ప్రపంచ అగ్ర దేశాల్లో ఒకటన్నారు. 'ఇది తనంతట తానుగా జరగలేదు. ప్రజాస్వామ్యంపై కాంగ్రెస్‌కు ఉన్న విశ్వాసం, అందరినీ వెంట తీసుకువెళ్లాలనే సమ్మిళిత సిద్ధాంతం, అందరికీ సమాన హక్కులు, అవకాశాలు కల్పించే రాజ్యాంగంపై మాకు ఉన్న విశ్వాసం కారణంగా జరిగింది' అని అన్నారు. పార్టీ మాజీ అధ్యక్షులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అగ్ర నాయకులు, కార్యకర్తల సమక్షంలో పార్టీ పతాకాన్ని ఖడ్గే ఆవిష్కరించారు.

రాహుల్‌కు భద్రత కల్పించండి

జోడో యాత్రలో అడుగడుగునా భద్రతా వైఫల్యం

అమిత్‌షాకు కాంగ్రెస్ లేఖ

న్యూదిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర దిల్లీలో అడుగుపెట్టిన సమయంలో ప్రజలను అదుపు చేయడంలో పోలీసుల వైఫల్యంపై కాంగ్రెస్ పార్టీ ఆందోళన వ్యక్తం చేసింది. భద్రతా వైఫల్యంపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు లేఖ రాసింది. రాహుల్ గాంధీకి, భారత్ జోడో యాత్రలో పాల్గొంటున్న వారికి, నేతలకు భద్రత కల్పించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరింది. బదర్‌పూర్ సరిహద్దు నుంచి డిసెంబర్ 24న రాహుల్‌గాంధీ వెంట వేలాది మంది మద్దతుదారులు పాదయాత్రలో పాల్గొన్నారు. ఎర్రకోట వైపు పాదయాత్ర సాగుతుండగా పెద్దసంఖ్యలో ప్రజలు రాహుల్ గాంధీతో సెల్ఫీలు దిగేందుకు ప్రయత్నించడం, ఆయనకు అతి దగ్గరగా రావడంతో కలకలం రేగింది. తొక్కిసలాట తరహా పరిస్థితి తలెత్తింది. దీనిపై కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ కేంద్ర హోంమంత్రికి లేఖ రాశారు. 'భారత్ జోడో యాత్రలో తీవ్రమైన భద్రతా లోపాలు తలెత్తిన విషయాన్ని మీ దృష్టికి తీసుకువస్తున్నాను. 24వ తేదీన పాదయాత్ర దిల్లీలోకి అడుగుపెట్టిన సమయంలో అనేక సందర్భాల్లో భద్రతా లోపాలు చోటుచేసుకున్నాయి. జడ్ ప్లస్ కేటగిరి సెక్యూరిటీ ఉన్న రాహుల్‌కు అతి దగ్గరగా ప్రజలు గుమిగూడుతున్నప్పుడు వారిని అదుపు చేయడంలో దిల్లీ పోలీసులు పూర్తిగా విఫలమయ్యారు. కేవలం మౌన ప్రేక్షకులుగా చూస్తుండిపోయారు. యాత్రలో పాల్గొనకుండా చాలామంది ప్రముఖులను వేధించారు. యాత్రలో పాల్గొన్న అనేక మందిని ఇంటెలిజెన్స్ బ్యూరో ఇంటరాగేట్ చేసింది. హరియాణా రాష్ట్ర ఇంటెలిజెన్స్‌కు చెందిన గుర్తుతెలియని దుండగులు భారత్ జోడో యాత్రలో అక్రమంగా ప్రవేశించారని డిసెంబర్ 23న సోహ్నా సిటీ పోలీస్ స్టేషన్‌లో మేము ఫిర్యాదు చేయడంతో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు' అని ఆ లేఖలో అమిత్‌షాకు వేణుగోపాల్ తెలిపారు. కాంగ్రెస్ నేతల త్యాగాలను సైతం వేణుగోపాల్ ఆ లేఖలో గుర్తు చేశారు. దేశ ఐక్యత, సమగ్రత కోసం కాంగ్రెస్ పార్టీ నుంచి ఇద్దరు ప్రధానమంత్రులు ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ తమ ప్రాణాలు అర్పించారని, 2013 మే 25న జీరమ్ ఘాటీలో నక్సల్స్ దాడిలో ఛత్తీస్‌గఢ్ నాయకత్వం మొత్తం అశువులు బాసిందని అన్నారు. జనవరి 3 నుంచి అత్యంత సున్నితమైన పంజాబ్ రాష్ట్రం, జమ్ముకశ్మీర్‌లో జోడో యాత్ర సాగాల్సి ఉందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని జడ్ ప్లస్ క్యాటగిరీ భద్రతలో ఉన్న రాహుల్, భారత్ జోడోయాత్రలో పాల్గొంటున్న కార్తకర్తలు, ప్రజలు, నేతలకు తగిన భద్రత కల్పించాలని అమిత్‌షాను వేణుగోపాల్ కోరారు.

జోడో యాత్రకు విపక్ష నేతలు

వేణుగోపాల్ వెల్లడి

శ్రీనగర్: వచ్చే ఏడాది కశ్మీర్ లోయలో జరగనున్న భారత్ జోడో యాత్రలో మాజీ ముఖ్యమంత్రులు ఫరూక్ అబ్దుల్లా, ఒమర్ అబ్దుల్లా, పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ సహా జమ్ముకశ్మీర్‌లో ప్రతిపక్ష నేతలు పాల్గొంటారని కాంగ్రెస్ నాయకుడు కేసీ వేణుగోపాల్ తెలిపారు. రాహుల్ గాంధీ నేతృత్వంలో భారత్ జోడో యాత్రకు సంబంధించి జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాను కలిసిన తర్వాత ఆయన ఈ ప్రకటన చేశారు. 'మేము కశ్మీర్‌లో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తాం. జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్‌తో సమావేశమయ్యాను. ఆయన అన్ని విధాలా సహకరించారు. ఈ యాత్రలో ఫరూక్ అబ్దుల్లా, ఒమర్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీ, సీపీఎం నాయకుడు ఎంవై తరిగామి పాల్గొంటారు' అని వేణుగోపాల్ వివరించారు. పార్టీ చేపట్టిన భారత్ జోడో యాత్ర 'జాతీయ పాదయాత్ర' అని అన్నారు. కాంగ్రెస్ చేపట్టిన భారత్ జోడో యాత్రను అంతకుముందు మెహబూబా ముఫ్తీ ప్రశంసించారు. మోదీ ప్రభుత్వంపై ముఫ్తీ విమర్శలు చేస్తూ, గత ఎనిమిదేళ్లలో ఈ ప్రభుత్వం దేశం పునాదులన్నింటినీ కదిలించి, బలహీనపరిచిందని విమర్శించారు. దేశ పునాదులను కాపాడేందుకు రాహుల్ గాంధీ ముందుకొచ్చారన్నారు. 'దేశ సంస్కృతి, సోదర భావాన్ని, పునాదులను కాపాడేందుకు భారీ ప్రజా ప్రచారాన్ని చేపట్టిన రాహుల్ గాంధీకి నేను నమస్కరిస్తున్నాను. ఈ దేశ వారసత్వాన్ని బలోపేతం చేసేందుకు, దేశాన్ని ఐక్యం చేసేందుకు ఆయన ఈ కార్యక్రమం చేపట్టారు' అని ముఫ్తీ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా కోవిడ్ కేసుల పెరుగుదల నడుమ భారత్ జోడో యాత్రను కాంగ్రెస్ నిలిపివేయాలని బీజేపీ కోరడంపై వేణుగోపాల్ ధ్వజమెత్తారు. 'కోవిడ్ పరిస్థితితో పాటు ఈ దేశ ప్రజల ఆరోగ్యం గురించి మేము తీవ్రమైన ఆందోళన చెందుతున్నాం.

ఈ మొత్తం డ్రామా (కోవిడ్ వ్యాప్తి) భారత్ జోడో యాత్రను నిలువరించేందుకు సృష్టించారు' అని మండిపడ్డారు. 'చైనా నుంచి విమానాలు వస్తున్నాయి. ఇబ్బంది లేదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) సూచించిన జాతీయస్థాయి కోవిడ్ ప్రోటోకాల్ లేదు. ప్రధాన మంత్రి బహిరంగ సభలకు హాజరవుతున్నారు. ప్రతిచోటా ఇతర ప్రభుత్వ కార్యక్రమాలన్నీ జరుగుతున్నాయి. ఇబ్బంది లేదు' అని ఆయన అన్నారు. జనవరి 22న జమ్ముకశ్మీర్‌లోకి యాత్ర ప్రవేశిస్తుందని భావిస్తున్నామని, యాత్ర జనవరి 30 వరకు కొనసాగుతుందని తెలిపారు.

శ్రామికులపై భారం సంస్కరణా?

- జాతీయ పెన్షన్ పథకంపై సన్యాల్ ప్రకటన సిగ్గుచేటు
- కార్పొరేట్ల పన్ను తగ్గించడం... చట్టాలు నిర్వీర్యం చేయడమే
- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్

న్యూఢిల్లీ: జాతీయ పెన్షన్ పథకం (ఎన్‌పీఎస్) ఒక 'సంస్కరణ' అని ప్రధానమంత్రి ఆర్థిక మండలి సభ్యుడు సంజీవ్ సన్యాల్ చేసిన వ్యాఖ్యలను కార్మిక సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఆయన చేసిన కార్పొరేట్ అనుకూల, కార్మిక వ్యతిరేక ప్రకటనను నిరసించాయి. పీటీఐకి ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో సన్యాల్ మాట్లాడుతూ 'నిధులు లేని పింఛను పథకాలు అంతిమంగా భవిష్యత్తు తరాలపై దాడి చేయడమేనని చాలా స్పష్టంగా చెప్పాలి. అందువల్ల రెండు దశాబ్దాలుగా చాలా కష్టంతో చేసిన పెన్షన్ సంస్కరణలను రివర్స్ చేయడానికి చాలా చాలా జాగ్రత్తగా ఉండాలి' అని అన్నారు. పాత పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్)కి మారాలని ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు తీసుకున్న నిర్ణయంపై అడిగిన ప్రశ్నకు సన్యాల్ సమాధానమిచ్చారు. ఎన్‌డీఏ ప్రభుత్వం ఓపీఎస్ కింద ఇచ్చే మొత్తం పెన్షన్‌ను ఏప్రిల్ 1, 2004 నుంచి నిలిపివేసింది. సన్యాల్ ప్రకటనను ఖండిస్తూ ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ ఓ ప్రకటన విడుదల చేశారు. 'పాత పెన్షన్ పథకం(ఓపీఎస్) పునరుద్ధరణకు వ్యతిరేకంగా సంజీవ్ సన్యాల్ చేసిన ప్రకటనను ఏఐటీయూసీ నిరసిస్తోంది. ఆర్థిక వ్యవస్థ నిర్వహణ భారం కోసం శ్రమిస్తున్న ప్రజల భుజాలపై వేసే ఏ విధానానికైనా ఈఏసీ 'సంస్కరణ' అనే పదాన్ని ఉపయోగిస్తుంది. నాలుగు లేబర్ కోడ్‌లు, ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్‌మెంట్, ఈపీఎస్-95 కనీస పెన్షన్ పెంపు డిమాండ్‌ను తిరస్కరించడం, ఇవన్నీ సంస్కరణలు అని పిలుస్తున్నారు. మరోవైపు, ఈ సంస్కరణలు అని పిలవబడేవి కార్పొరేట్ల పన్ను బాధ్యతను తగ్గిస్తాయి. 'వ్యాపారం చేయడం సులభతరం' కోసం వివిధ చట్టాలను నిర్వీర్యం చేస్తున్నాయి. కార్పొరేట్ పన్నులు, ఆదాయపు పన్ను, సంపద పన్ను పునరుద్ధరణ, వారసత్వపు పన్ను మొదలైనవాటిని పెంచడం ద్వారా అన్ని పెన్షన్ పథకాలకు పూర్తిగా కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూర్చాలని ఏఐటీయూసీ డిమాండ్ చేస్తోంది' అని అమర్‌జిత్ కౌర్ అన్నారు. అఖిల భారత రక్షణ ఉద్యోగుల సమాఖ్య (ఏఐడీఈఎఫ్) ప్రధాన కార్యదర్శి సి.శ్రీకుమార్ స్పందిస్తూ ఎన్‌పీఎస్ కావాలని వాదించే వారు... ఓపీఎస్ లబ్ధిదారులు తమ సర్వీసు మొత్తంలో ప్రతి నెలా తమ వేతనాల నుంచి 10 శాతం అందించిన తర్వాత ఎన్‌పీఎస్ ఉద్యోగులు రూ.2000 నుంచి రూ.5000 వరకు తక్కువ పింఛను పొందుతున్నారని అర్థం చేసుకోవడంలో విఫలమయ్యారని పేర్కొన్నారు. 'నిత్యావసర వస్తువుల ధరల అదుపులేని పెరుగుదలలో ఈ మొత్తంతో ఎవరైనా ఎలా జీవించగలరు? కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విషయమేదైనా సంస్కరణలు అని సిగ్గు లేకుండా పిలుస్తున్నారు' అని సి.శ్రీకుమార్ మండిపడ్డారు.

ప్రజాస్వామ్యం... రాజ్యాంగం నిర్వీర్యం

బీజేపీ-ఆర్ఎస్ఎస్ విధానాలపై గెహ్లాట్ ధ్వజం

జైపూర్: బీజేపీ, ఆర్ఎస్ఎస్... ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని బలహీనపరుస్తున్నాయని రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ బుధవారం విమర్శించారు. వారి విధానాలు, కార్యక్రమాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ పోరాటాన్ని కొనసాగిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గెహ్లాట్ విలేకరులతో మాట్లాడుతూ పార్టీ స్థాపించినప్పటి నుంచి చాలా ముందుకు వచ్చిందని, అధికారంలో ఉన్నా లేకున్నా... దాని విధానాలు, కార్యక్రమాలపై దృఢంగా ఉందని తెలిపారు. 'ఆర్ఎస్ఎస్-బీజేపీ విధానాలు, కార్యక్రమాలకు వ్యతిరేకంగా మా పోరాటమని రాహుల్ గాంధీ అన్నారు. మేము రాజ్యాంగాన్ని పరిరక్షించగల సమర్థులం. వారు రాజ్యాంగాన్ని ధ్వంసం చేశారు. ప్రజాస్వామ్య మూలాలను నిర్వీర్యం చేశారు. దేశం దానిని సహించదు" అని ఆయన తెలిపారు. పార్టీ కొత్త అధ్యక్షుడిగా మల్లికార్జున ఖర్గే అయిన విషయాన్ని ప్రస్తావిస్తూ, '50 ఏళ్లలో తొలిసారి దళిత వర్గానికి చెందిన వ్యక్తి మా పార్టీ అధ్యక్షుడు అయ్యారు' అని అన్నారు. దేశంలో మంచి వాతా వరణం నెలకొల్పేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి పని చేయాలని కోరారు. అంతకుముందు, గెహ్లాట్ ట్విట్టర్‌లో, కాంగ్రెస్ పార్టీ పాత చిత్రం ఒక దానిని పోస్టు చేశారు. 'కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమం సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు. ఈ రోజు మనం గర్వించదగిన ఒక గొప్ప రోజు' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గోవింద్ సింగ్ దోస్తారా కూడా పార్టీ కార్య కర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక దినోత్సవం నాడు ప్రజలందరి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని పార్టీని స్థాపించిన ఆ గొప్ప వ్యవస్థాపకులందరికీ నమస్కారం' అని ట్వీట్ చేశారు. మాజీ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలట్ ట్వీట్ చేస్తూ, భారత జాతీయ కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఆఫీసు బేరర్‌లు అందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు అని పేర్కొన్నారు. దేశ ఐక్యత, సమగ్రత, ప్రజాస్వామ్య హక్కులు, రాజ్యాంగ పరిరక్షణ ప్రధానమైనవిగా పరిగణించి ఎల్లప్పుడూ ప్రజాసేవకు అంకితం కావాలని కోరారు.

యూపీలో ఓబీసీ కోటా రగడ

- రిజర్వేషన్లు కల్పించాకే స్థానిక ఎన్నికలు
- సుప్రీంకోర్టుకు వెళతాం: కేపీ మౌర్య

అలహాబాద్: ఉత్తరప్రదేశ్‌లో ఓబీసీ కోటాపై అధికార-విపక్షాల మధ్య మాటలయుద్ధం జరుగుతోంది. ఈ పంచాయితీ అలహాబాద్ హైకోర్టుకు చేరింది. ఓబీసీ రిజర్వేషన్లు లేకుండా స్థానిక ఎన్నికలు నిర్వహించాలన్న న్యాయస్థానం నిర్ణయాన్ని రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం ధిక్కరించింది. అందుకు ససేమిరా అంటోంది. అవసరమైతే దీనిపై సుప్రీంకోర్టుకు వెళతామని చెబుతోంది. ఓబీసీ రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే స్థానిక ఎన్నికలు జరుగుతాయని, ఇందులో రాజీ పడబోమని చెబుతోంది. ఓబీసీ కోటా లేకపోతే స్థానిక ఎన్నికలు నిర్వహించే ప్రసక్తే లేదని ఉత్తరప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య తేల్చి చెప్పారు. ఇతర వెనుకబడిన వర్గాల (ఓబీసీ)కు రిజర్వేషన్లు లేకుండానే మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలంటూ రాష్ట్ర ప్రభుత్వ ముసాయిదా నోటిఫికేషన్‌ను అలహాబాద్ హైకోర్టు రద్దు చేసింది. ట్రిపుల్ టెస్ట్ ఫార్ములాను పాటించలేదని పేర్కొంది. ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించే ప్రతిపాదనను పక్కనపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది.అయితే పట్టణ స్థానిక సంస్థల (యూఎల్‌బీ) ఎన్నికల్లో ఓబీసీ రిజర్వేషన్ల కల్పన కోసం సుప్రీంకోర్టు ట్రిపుల్ టెస్ట్ ఫార్ములాను సూచించింది. ఇందుకోసం కమిషనర్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించాల్సి ఉంటుంది. ఆయా వర్గాలకు సంబంధించి సముచిత డేటానూ సేకరించాలి. 50శాతానికి మించకుండా స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కేటాయించాలి. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఈనెల 5న మున్సిపల్ ఎన్నికల కోసం నోటిఫికేషన్ జారీ చేసింది. 17 మున్సిపల్ కార్పొరేషన్లకు మేయర్ల రిజర్వుడ్ సీట్లు, 200 మున్సిపల్ మండళ్ల చైర్‌పర్సన్‌లు, 545 నగర పంచాయతీల కోసం మూడంచెల ఎన్నికలకు సంబంధించి రిజర్వుడ్ స్థానాల జాబితాను విడుదల చేసింది. ఏడు రోజుల్లో దీనిపై సూచనలు, అభ్యంతరాలు తెలియజేయాలని సూచించింది. ఈ నోటిఫికేషన్ ప్రకారం అలీగఢ్, మథుర-బృందావన్, మీరట్, ప్రయాగ్‌రాజ్ మేయర్ స్థానాలను ఓబీసీలకు రిజర్వ్ చేశారు. వీటిలో అలీగఢ్, మథుర-బృందావన్ మేయర్ సీట్లను ఓబీసీ మహిళలకు కేటాయించారు. 200 మున్సిపల్ మండళ్లలో 54 చైర్‌పర్సన్ స్థానాలనూ ఓబీసీలకు కేటాయించారు. ఇందులో 18 సీట్లు ఓబీసీ మహిళలకు దక్కాయి. 545 నగర పంచాయతీల్లో 49 మహిళా స్థానాలు సహా 147 స్థానాలను ఓబీసీలకు కేటాయించారు. దీంతో ట్రిపుల్ టెస్ట్ ఫార్ములాను అనుసరించకుండా రిజర్వేషన్లు కేటాయించడాన్ని సవాల్ చేస్తూ అనేక వ్యాజ్యాలు నమోదు కాగా హైకోర్టు వాటిని పరిశీలించి నోటిఫికేషన్ రద్దునకు ఆదేశాలిచ్చింది. హైకోర్టు తీర్పుపై మౌర్య స్పందించారు. ప్రముఖ ఆంగ్ల పత్రికతో మాట్లాడిన ఆయన ఓబీసీ రిజర్వేషన్లు లేకుండా ఎన్నికలకు వెళ్లబోమని, అవసరమైతే దీనిని సుప్రీంకోర్టులో సవాలు చేస్తామని తెలిపారు. 'హైకోర్టు నిర్ణయాన్ని గౌరవిస్తాంగానీ దాంతో ఏకీభవించం. ఓబీసీలకు న్యాయం, ప్రాతినిధ్యం కల్పించేందుకు బీజేపీ ప్రభుత్వం కట్టుబడి ఉంది. రిజర్వేషన్లు అమలైన తర్వాతే ఎన్నికలు ఉంటాయి. లేకపోతే రాష్ట్ర జనాభాలో 54-55శాతంగా ఉన్న వారికి అన్యాయం జరుగుతుంది. ఇది రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశం కాదు. దీనిపై ప్రతిపక్ష సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పీ) రాజకీయం చేస్తోంది' అని అన్నారు.

కేఎస్‌బీసీడీసీ మూలధనం పెంపు

తిరువనంతపురం: వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తున్న కేరళ రాష్ట్ర వెనుకబడిన వర్గాల అభివృద్ధి సంస్థ (కేఎస్‌బీసీడీసీ) అధీకృత వాటా మూలధనాన్ని రూ.200 కోట్లకు పెంచుతూ కేరళ ప్రభుత్వం బుధవారం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం కేఎస్‌బీసీడీసీ లిమిటెడ్ అధీకృత మూలధనం రూ.150 కోట్లు అని సీఎంఓ తెలిపింది. ఒక ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ, పూర్తిగా కేరళ ప్రభుత్వానికి చెందినది, కేఎస్‌బీసీడీసీ వెనుక బడిన తరగతులను పేదరికం, వెనుకబాటుతనం నుంచి పైకి తీసుకువచ్చేందుకు ఉద్దేశించబడింది. ఇతర విషయాలతోపాటు మత్స్యకారులకు పునరావాసం, గృహనిర్మాణ ప్రాజెక్టు అయిన 'పునర్గేహం' సజావుగా అమలు చేయడానికి అదనపు అధికారం ద్వారా రూ. 42.75 కోట్లు కేటాయించాలని ఆర్థిక శాఖను మంత్రివర్గం ఆదేశించింది. ఎక్సైజ్ శాఖలోని మొబైల్ ఇంటర్వెన్షన్ యూనిట్ కోసం నాలుగు వాహనాల కొనుగోలుకు అనుమతిచ్చినట్లు సీఎంఓ పేర్కొంది.

24 గంటల్లో 188కిపైగా కేసులు

న్యూఢిల్లీ: కరోనా మరోసారి విజృంభిస్తోంది. దేశవ్యాప్తంగా గడచిన 24 గంటల్లో 188 కొత్త కరోనా కేసులు నమోదైనట్లు ఆరోగ్య మంత్రిత్వశాఖ బుధవారం వెల్లడించింది. క్రియాశీల కేసుల సంఖ్య 3,468గా ఉందని పేర్కొంది. ఇక రికవరీ రేటు 98.8 శాతంగా ఉంది. గడచిన 24 గంటల్లో 141 మంది కరోనా నుంచి కోలుకున్నారు. రోజువారీ పాజిటివిటీ రేటు 0.14 శాతంగా ఉంది. ఇక మంగళవారం ఒక్కరోజే 90,529 వాక్సిన్ డోసులను కేంద్ర ప్రభుత్వం అందజేసింది. కరోనా ప్రారంభమైనప్పటి నుంచి వాక్సినేషన్ డ్రైవ్‌లో భాగంగా దేశవ్యాప్తంగా 220.07 కోట్ల వాక్సిన్ డోసులను అందజేసినట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి.

జైలు నుంచి ఎన్‌సీపీ నేత విడుదల

ముంబై: మహారాష్ట్ర హోం శాఖ మాజీ మంత్రి, ఎన్‌సీపీ నేత అనిల్ దేశ్‌ముఖ్ ముంబైలోని ఆర్థర్ రోడ్ జైలు నుంచి బెయిలుపై బుధ వారం విడుదలయ్యారు. 72 ఏళ్ల దేశ్‌ముఖ్ ఏడాదికి పైగా జైలులో ఉన్నారు. మనీ లాడరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టు చేయడంతో నవంబర్ 2021 నుంచి ఆయన జైలు జీవితం గడిపారు. డిసెంబర్ 12న జస్టిస్ ఎంఎస్ కార్నిక్ ఆయనకు బెయిల్ మంజూరు చేశారు. అయితే ఈ తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేసేందుకు సీబీఐ 10 రోజులు గడువు అడగటంతో డిసెంబర్ 27 వరకూ హైకోర్టు తమ ఉత్తర్వులపై స్టే ఇచ్చింది. అనంతరం అత్యున్నత న్యాయస్థానాన్ని సీబీఐ ఆశ్రయించింది. కోర్టుకు సెలవులు కావడంతో 2023 జనవరిలోనే ఈ పిటిషన్ విచారణకు వస్తుంది. ఈ క్రమంలో తమకు మరికొంత వ్యవధి కావాలని కోర్టును సీబీఐ మంగళవారం కోరింది. దీనిపై దేశ్‌ముఖ్ న్యాయవాదులు అంకిత్ నికమ్, ఇంద్రపాల్ సింగ్ వాదన వినిపిస్తూ, ఎట్టిపరిస్థితుల్లోనూ బెయిలును మరోసారి పొడిగించేంది లేదని హైకోర్టు ఇచ్చిన తీర్పును సీబీఐ పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తోందని అన్నారు. వాదనల అనంతరం కోర్టు బుధవారం తీర్పు వెలువరిస్తూ, తాము బెయిలు మంజూరు చేస్తూ ఇంతకుముందు ఇచ్చిన తీర్పుపై మరోసారి స్టే ఇవ్వలేమని స్పష్టం చేసింది. దీంతో దేశ్‌ముఖ్ విడుదలకు మార్గం సుగమం అయింది.

యాత్రతో అలజడి సృష్టిస్తారా: ఠాకూర్

న్యూఢిల్లీ: గడచిన సంవత్సరం నుంచి జమ్ముకశ్మీర్‌ను సుమారు 1.6 కోట్ల మంది సందర్శించారని, ఇది రికార్డ్ అని కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు. ప్రశాంతంగా ఉన్న వాతావరణంలో రాహుల్ అలజడి సృష్టిస్తారా? అని ఆయన ప్రశ్నించారు. మోదీ హయాంలో జమ్ముకశ్మీర్‌లో పరిస్థితి ప్రశాంతంగా ఉందని ఠాకూర్ పేర్కొన్నారు. 'జమ్ముకశ్మీర్‌లో ప్రతి మూలను సందర్శకులు పర్యటిస్తున్నారు. దీన్ని బట్టి జమ్ముకశ్మీర్‌లో పరిస్థితి ప్రశాంతంగా ఉన్నట్టు అర్థమవుతోంది. రాళ్లు రువ్వుకున్న సందర్భాలు లేవు. అలాంటి వాతావరణాన్ని రాహుల్ గాంధీ అక్కడికి వెళ్లి నాశనం చేస్తారా? అని ప్రశ్నించారు. జమ్ముకశ్మీర్‌లో ఏక్కడైనా మూడు రంగుల జెండాలు ఎగురవేయవచ్చు. ఎందుకంటే జమ్ముకశ్మీర్‌లో ఆర్టికల్ 370, 35ఎ మోదీ ప్రభుత్వం తొలగించింది' అని పేర్కొన్నారు.

నేపాల్‌లో భూకంపం

ఖాట్మండు: నేపాల్‌లో భూకంపం సంభవించింది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత కేవలం గంటల వ్యవధిలో రెండుసార్లు భూమి కంపించింది. నేపాల్‌లోని బాగ్లుంగ్ జిల్లాలో 4.7, 5.7 తీవ్రతతో భూకంపం వచ్చింది. ఈ విషయాన్ని నేపాల్ భూకంప పర్యవేక్షణ, పరిశోధ కేంద్రం ప్రకటించింది. అర్ధరాత్రి 1.23 గంటల సమయంలో (నేపాల్ కాలమానం) ముందుగా తొలిసారి భూమి కంపించింది. బాగ్లుంగ్ జిల్లా.. అధికరి చౌర్ లో రిక్టర్ స్కేలుపై 4.7 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఆ తర్వాత జిల్లా పరిధిలోని ఖుంగాలో 2.07 గంటల సమయంలో రెండోసారి భూమి కంపించింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 5.3గా నమోదైంది.

ఏప్రిల్ 28న పొన్నియన్ సెల్వన్-2

చెన్నై: మణిరత్నం దర్శకత్వంలో తెరకెక్కిన హిస్టారికల్ ఎపిక్ యాక్షన్ డ్రామా 'పొన్నియిన్ సెల్వన్'. రెండు భాగాలుగా వస్తున్న ఈ చిత్ర తొలి భాగం ఈ ఏడాది ప్రేక్షకుల ముందుకు వచ్చి, మంచి విజయాన్ని అందుకుంది. బాక్సాఫీస్ వద్ద ఏకంగా రూ.500 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. ఈ సినిమా చూసిన వారందరూ పార్ట్-2 కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో చిత్ర బృందం 'పొన్నియిన్ సెల్వన్-2' గురించి ఆసక్తికర అప్‌డేట్‌ను పంచుకుంది. రెండో భాగం 2023, ఏప్రిల్ 28న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు తెలిపింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ వీడియోను షేర్ చేసింది. ఇందులో ఆదిత్య కరికాలన్ (విక్రమ్), పొన్నియిన్‌సెల్వన్ (జయం రవి), వందియదేవన్ (కార్తి), నందిని (ఐశ్వర్య రాయ్ బచ్చన్) పాత్రలను చూపించారు. రెండో భాగంలో వీరి పాత్రలే కీలకం కానున్నట్లు తెలుస్తోంది. విక్రమ్, ఐశ్వర్య రాయ్, జయం రవి, కార్తి, త్రిష ఇలా భారీ తారా గణం నటించిన 'పొన్నియిన్ సెల్వన్' తొలి భాగంలో చాలా ప్రశ్నలకు సమాధానం చెప్పలేదు. సుందర చోళుడి (ప్రకాశ్‌రాజ్)ని తప్పించి మధురాంతకుడి (రెహమాన్)ని చక్రవర్తిని చేయాలనుకున్న పళవేట్టురాయర్ (శరతకుమార్) కుట్ర భగ్నమైందా? పొన్నియిన్ సెల్వన్ (జయం రవి)ను ఖైదు చేసిన తర్వాత చోటు చేసుకున్న పరిణామాలేంటి? నందిని (ఐశ్వర్యా రాయ్) ఎవరు? ఆమెకు, పొన్నియిన్ సెల్వన్‌కీ, ఆదిత్య కరికాలన్ (విక్రమ్)కీ ఉన్న సంబంధం ఏంటి? కుందవై (త్రిష) ఎలాంటి రాజనీతిజ్ఞత ఉపయోగించింది? తన మిత్రుడికి కోసం వందియదేవన్ (కార్తి) ఎలాంటి సాహసం చేశాడు? అనే విషయాలను రెండో భాగంలో మణిరత్నం చూపించనున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందించిన ఈ చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది.

చలపతిరావుకు

కన్నీటివీడ్కోలు

హైదరాబాద్: సినీనటుడు చలపతిరావు అంత్యక్రియలు ముగిశాయి. జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానం విద్యుత్ దహన వాటిక వద్ద ఆయన కుమారుడు రవిబాబు, కుటుంబ సభ్యుల సమక్షంలో అంతిమ సంస్కారాలను నిర్వహించారు. అంత్యక్రియలకు అనేకమంది సినీ ప్రముఖులు హాజరయ్యారు. మంచు మనోజ్, దగ్గుబాటి సురేశ్‌బాబు, బండ్ల గణేశ్, బోయపాటి శ్రీను, శ్రీవాస్, బి.గోపాల్, రఘుబాబు, కాశీ విశ్వనాథ్ తదితరులు అక్కడికి వెళ్లారు. హైదరాబాద్ బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని తన నివాసంలో శనివారం రాత్రి చలపతిరావు గుండెపోటుతో మృతిచెందారు. అమెరికాలో స్థిరపడిన కుమార్తెలు శ్రీదేవి, మాలిని హైదరాబాద్ చేరుకున్న అనంతరం బుధవారం ఆయన అంత్యక్రియలు పూర్తిచేశారు.

కొత్తలో నన్ను ఎవరూ మెచ్చుకోలేదు: శ్రుతి

హైదరాబాద్: ప్రస్తుతం శ్రుతి హాసన్ చేతినిండా సినిమాలతో బిజీగా ఉంది. వచ్చే ఏడాది ఈ అమ్మడు నటించిన సినిమాలు వరసగా ప్రేక్షకులను అలరించనున్నాయి. టాలీవుడ్‌లో ఉన్న అగ్రహీరోలందరి సరసన ఆడిపాడుతున్న శ్రుతి తాజాగా ఓ ప్రముఖ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన కెరీర్, సినిమా పరిశ్రమ గురించి కొన్ని ఆసక్తికర విషయాలు పంచుకుంది. సినిమాల్లో నటించాలంటే వయసుతో సంబంధంలేదని, అది కేవలం ఒక సంఖ్య మాత్రమేనని చెప్పింది. సోషల్‌మీడియాలో నటీనటుల వయసు గురించి అనేక రకాలుగా మాట్లాడతారని.. కానీ, ఏ వయసులో ఉండే అందం ఆ వయసులో ఉంటుందని శ్రుతి వెల్లడించింది. తాను చేసే పాత్రలపై మాత్రమే దృష్టిపెడుతానని.. ఇతర విషయాల గురించి ఆలోచించనని స్పష్టం చేసింది. ఇక తన కెరీర్ గురించి మాట్లాడుతూ.."ప్రేక్షకులు ఎవరైనా నటీనటులు బాగా చేయాలని కోరుకుంటారు. నేను చేసిన కొన్ని పాత్రలు కొంతమందికి నచ్చకపోవచ్చు. కానీ, నేను ప్రతి సినిమాకు మెరుగవుతూ వచ్చాను. ప్రతి చిత్రంలో నుంచి ఏదో ఒక విషయాన్ని నేర్చుకున్నాను. నేను ఇండస్ట్రీకి వచ్చిన కొత్తలో నన్ను ఎవరూ మెచ్చుకోలేదు. కానీ ఇప్పుడు సినిమాలపై నాకు ఉన్న తపన అందరికీ అర్థమైంది. ఇప్పుడు నా గురించి, నా నటన గురించి అందరూ మాట్లాడుకుంటున్నారు" అని తనను ఆదరించే ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపింది.

కాంగ్రెస్ గాడిలో పడుతోంది: స్టాలిన్

చెన్నై: తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే చీఫ్ ఎంకే స్టాలిన్ తన మిత్ర పక్షం కాంగ్రెస్‌ను గట్టిగా నమ్ముతున్నారు. కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవాల సందర్భంగా ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో స్టాలిన్ మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో కాంగ్రెస్ ప్రాధాన్యాన్ని కోల్పోయిందనడాన్ని తాను నమ్మబోనని చెప్పారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో తలపడేందుకు కాంగ్రెస్ పార్టీతో కూడిన జాతీయ కూటమి అవసరమని చెప్పారు. కాంగ్రెస్ తిరిగి గాడిలో పడుతోందని, దేశానికి ఇప్పుడు అదే అవసరమని చెప్పారు. సంకుచిత రాజకీయాలకు మేలైన విరుగుడు మందు వంటివారు సోదరుడు రాహుల్ గాంధీ అని స్టాలిన్ అన్నారు. రాష్ట్ర స్థాయిలో బలమైన ప్రాంతీయ పార్టీతో జాతీయ పార్టీ పొత్తు పెట్టుకోవడమనే తమిళనాడు నమూనాను ఇతర రాష్ట్రాల్లో కూడా అనుసరించవచ్చునని తెలిపారు. రాజకీయంగా కాంగ్రెస్ క్షీణిస్తుండటానికి కారణాలేమిటని భావిస్తున్నారని ప్రశ్నించినపుడు స్టాలిన్ స్పందిస్తూ, జాతీయ స్థాయిలో కాంగ్రెస్ ప్రాధాన్యం కోల్పోయిందనడాన్ని తాను అంగీకరించనని చెప్పారు. కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడానికి సోనియా గాంధీ తీసుకున్న చర్యల ఫలితాలు రావడం ప్రారంభమైందన్నారు. సీనియర్ నేత మల్లికార్జున ఖర్గే తన విశేష అనుభవంతో పార్టీని పునరుజ్జీవం దిశగా నడుపుతున్నారని చెప్పారు. కాంగ్రెస్, డీఎంకే పొత్తు వల్ల కలిసొచ్చిందనుకుంటున్నారా? భవిష్యత్తులో కూడా ఈ పొత్తు కొనసాగుతుందా? అని అడిగినపుడు స్టాలిన్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగాన్ని కాపాడాలని తాము బలంగా భావిస్తున్నామన్నారు. మన దేశ ఫౌండింగ్ ఫాదర్స్ మనకు అప్పగించిన మౌలిక విలువలు, సిద్ధాంతాలు నిర్వీర్యం కాకూడదన్నారు. రాజ్యాంగ వ్యవస్థలు స్వతంత్రంగా పని చేయాలని కోరుకునే తమ వంటివారంతా కాంగ్రెస్‌తో కూడిన జాతీయ కూటమి ఉండాలని ప్రతిపాదిస్తున్నట్లు తెలిపారు. తమిళనాడులో డీఎంకే ఇప్పటికే అటువంటి కూటమిని ఏర్పాటు చేసిందన్నారు. మిగతా చోట్ల కూడా అమలు చేయడానికి విజయవంతమైన నమూనాగా నిలిపిందన్నారు.

ధోనీ కుమార్తెకు మెస్సి జెర్సీ

ముంబై: ఫుట్‌బాల్ దిగ్గజం, ఆల్‌టైమ్ గ్రేట్ లియోనెల్ మెస్సి ఫిఫా ప్రపంచ కప్ ట్రోఫీని ముద్దాడి తన చిరకాల కలను నెరవేర్చుకున్న విషయం తెలిసిందే. టైటిల్ నెగ్గిన ఆనం దంలో మునిగి తేలుతున్న మెస్సి తన అభిమానులు, ఫాలోవర్లను మాత్రం మరిచి పోలేదు. ఇక భారత్‌లోనూ అతడికి పెద్ద సంఖ్యలో ఫ్యాన్స్ ఉన్న విషయం తెలిసిందే. ధోనీ, కోహ్లి లాంటి క్రికెటర్లూ అతడిని ఫాలో అవుతుంటారు. ఈ నేపథ్యంలో ధోనీ కూతురు జీవాకు మెస్సి తాను సంతకం చేసిన అర్జెంటీనా జెర్సీని పంపి తన ప్రేమను చాటాడు. ఆ జెర్సీని ఇన్‌స్టాలో పోస్టు చేసిన జీవా.. ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యింది. ఆ జెర్సీపై 'జీవా కోసం' అని రాసి దాని కింద మెస్సి సంతకం చేశాడు. గతంలో కూడా మెస్సి.. బీసీసీఐ కార్యదర్శి జై షాకు ఇలాంటి జెర్సీనే పంపిన విషయాన్ని స్పిన్నర్ ప్రజ్ఞాన్ ఓజా వెల్లడించిన విషయం తెలిసిందే.

శ్రద్ధాంజలి

మా అందరికీ ప్రేమానురాగాలను పంచి
మా కుటుంబ ఉన్నతికై అహర్నిశలు
శ్రమించిన మా తల్లి గారైన
కీ॥శే॥ చుండూరి రాఘవమ్మ గారు
ది.15-12-2022 గురువారం
స్వర్గసులైనారు. వారి పెద్దకర్మ
ది.29-12-2022 గురువారం
ఉదయం 9:00 గంటలకు
పల్నాడు జిల్లా, శావల్యాపురం మం॥,
కారుమంచి గ్రామంలోని మా స్వగృహమునందు
కార్యక్రమము జరుగును.
కావున తెలియ పరచటమైనది.

కీ॥శే॥ చుండూరి రాఘవమ్మ గారు
మరణం : 15-12-2022

భర్త : చుండూరి వెంకటేశ్వర్లు మాజీ ఎం.పీ.పీ
కుమారుడు : చుండూరి విశ్వనాథ్ చౌదరి
కోడలు : హిమబిందు
మనుమరాలు : మోక్షిత

కుటుంబ సభ్యులు

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.